



# విజయభాను


44th వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, ఆదివారం 27-12-2020 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 44 సంచిక : 93 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## అర్హులందరికీ ఇల్లు మంజూరు

### పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు



విశాఖపట్నం : ఇల్లు లేని పేద ప్రజల్లో అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందని పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన పద్మనాభం మండలం అయినాడ, బి.ఆర్. తాళ్లవలస గ్రామాలలో పేదలందరికీ ఇల్లు కార్యక్రమం క్రింద ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి తన పాదయాత్రలో ప్రజల కష్టాలు తీర్చాలని వారికి అవసరమైన ఏమిటో తెలుసుకున్నారని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్క పేదవారికి పక్కా ఇల్లు అందజేయాలని ముఖ్యమంత్రి సంకల్పించి పేదలందరికీ ఇల్లు అనే పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఇల్లు లేని పేద వారిని గుర్తించి కుటుంబంలో మహిళ పేరున భూమి పట్టా ఇవ్వడం జరుగుతుందన్నారు. అయినాడ గ్రామంలో తమ ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరం కాలంలో రూ 5 లక్షల సంక్షేమ కార్యక్రమాలు రూ 2 లక్షల 68 అభివృద్ధి కార్యక్రమాలు మొత్తం రూ. 7 లక్షల 75 చేపట్టామన్నారు. అనంతరం బి.ఆర్ తాళ్లవలస గ్రామం లో జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ గ్రామంలో ఉన్న 999 కుటుంబాలకు ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల ద్వారా ఇప్పటి వరకు రూ. 4 కోట్ల 75 లక్షలు లబ్ది చేకూరిందని తెలిపారు. పాండ్రంగి వద్ద నిర్మించే బ్రిడ్జికి రూ 14 కోట్లు, రేవిడి వెంకటాపురం రోడ్డు కి రూ.16 కోట్ల, రెడ్డిపల్లి పద్మనాభం రోడ్డు రూ. 10 కోట్లు, అనంత పద్మనాభ స్వామి కొండరోడ్డుకు రూ 5 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. మండల కేంద్రమైన పద్మనాభం లో జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని చెప్పారు.

జిల్లా కలెక్టరు వి.వినయ్ చంద్ మాట్లాడుతూ బి.ఆర్. తాళ్లవలస గ్రామంలో 92 మందికి మంత్రి చేతుల మీదుగా పట్టాలు అందిస్తున్నామన్నారు. పట్టాలు ఇచ్చిన స్థలాల్లో రూ.లక్షా ఎనభై వేల తో ప్రభుత్వం ఇల్లు నిర్మించి ఇస్తుందన్నారు. ఇంటి నిర్మాణం కోసం మంజూరు పత్రం, ఒక సంవత్సరంలో గా నిర్మాణం చేసి

తరువాయి 2లో..



## ఘనంగా చక్రస్నాన మహోత్సవం



తిరుపతి : శ్రీవారి పుష్కరిణిలో చక్ర స్నాన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. వైకుంఠ ద్వాదశి సందర్భంగా చక్రస్నానాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

కోవిడ్ నిబంధనల కారణంగా భక్తులను అనుమతించలేదు. వేకువ జామున చక్రతాళ్వార్‌ను ఊరేగింపుగా శ్రీవారి పుష్కరిణికి తీసుకెళ్లి, అక్కడ చక్రతాళ్వార్ కి తిరుమంజనం నిర్వహించారు.

అర్చకులు. అనంతరం కర్పూర నీరాజనాలు అందించి, పుష్కరిణి చక్రతాళ్వార్‌కి స్నానమాచరింపు చేశారు.

చక్రస్నానంలో టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో జవహర్ రెడ్డిలతో పాటు అర్చకులు పాల్గొన్నారు. కొవిడ్ వ్యాప్తి చెందకుండా ఏకాంతంగా చక్రస్నానాన్ని నిర్వహించారు.

### శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు..

ద్వాదశి పర్వదినాన తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉదయం విఐపీ దర్శనంలో సూప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇందిర బెనర్జీ, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గా ప్రసాదరావు, మాజీ పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎల్.నరసింహారెడ్డి, తెలంగాణ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి స్వామివారిని దర్శించుకుని వైకుంఠ ప్రదక్షిణ చేశారు. అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందించారు.

## వాజ్‌పేయీ ఎందరికో ఆదర్శం



హైదరాబాద్: దేశభక్తి, జాతీయవాదంపై అనేక మంది అనవసర చర్చలు చేస్తున్నారని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. సకల భారతీయుల హితం కోరడమే అసలైన జాతీయవాదమని అన్నారు. సికింద్రాబాద్ మారియట్ హోటల్‌లో వాజ్‌పేయీ మెమోరియల్ సదస్సులో ఉపరాష్ట్రపతి ప్రసంగించారు. మాజీ ప్రధాని వాజ్‌పేయీతో తనకున్న ప్రత్యేక అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. సమర్థ నాయకత్వం, సుస్థిర పాలన అందించిన వాజ్‌పేయీ ఎందరికో ఆదర్శనీయమన్నారు. ఎన్నో సాహసోపేతమైన సంస్కరణలతో దేశ రూపురేఖలు మార్చారని కొనియాడారు. ఆర్థిక సంస్కరణల అమలును ఎంతో వేగవంతం చేశారని ప్రశంసించారు. వాజ్‌పేయీ తన భావాలను కవితల రూపంలో వెల్లడించేవారని అన్నారు. ఆయన నుంచి నేటి యువతరం ఎంతో నేర్చుకోవాలని.. ఆయన వ్యక్తిత్వం, ధైర్యం, సామర్థ్యం స్ఫూర్తిదాయకం అన్నారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా అద్భుతమైన ప్రసంగాలు చేశారని కొనియాడారు. సమాజంలో వేగంగా మార్పులు రావాలని ఆయన కోరుకునేవారని.. పోఖ్రాన్-2 పరీక్షలతో భారతదేశ ప్రతిష్ఠను మరింత పెంచారని వెంకయ్య నాయుడు తెలిపారు.

## పోలవరంపై సానుకూల ధోరణిలో కేంద్రం

### *పోలవరం సవరించిన అంచనా వ్యయంపై సానుకూల ధోరణిలో కేంద్రం !*

అమరావతి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వం శుభవార్తను అందించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజ్ఞప్తిని పరిశీలించిన కేంద్ర.. పోలవరం అంచనా వ్యయంపై కొనసాగుతున్న సస్పెన్స్‌కు తెరదించుతూ సానుకూల ధోరణిలో స్పందించింది. ఈ మేరకు పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదించిన వ్యయం 55,548.87కోట్ల రూపాయలని అధికారికంగా ప్రకటన జారీచేసింది. జలశక్తి శాఖ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో సంవత్సర సమీక్షలో శనివారం వెల్లడించింది. గతంలో టీడీపీ ప్రభుత్వంతో ఒప్పందంలో భాగంగా 2014 ధరల ప్రకారం చెల్లింపులు చేస్తామని కేంద్ర ప్రభుత్వం కొర్రీలు వేసిన విషయం తెలిసిందే. దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం.. కేంద్ర ప్రభుత్వం లేవనెత్తిన సందేహాలకు సమాధానాలు ఇచ్చి ప్రాజెక్టు వ్యయంపై పూర్తి నివేదికను సమర్పించింది.

**ఫలించిన సీఎం జగన్ ప్రయత్నం..**

సవరించిన అంచనాలను ఆమోదించాలని ఇటీవల హోంమంత్రి అమిత్ షా, జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను కలిసి సీఎం జగన్ కోరిన విషయం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌కు ప్రాణాధారమైన పోలవరం ఫలాలను వీలైనంత త్వరగా ప్రజలకు అందచేసేలా కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సవరించిన వ్యయ అంచనాలు -2 (ఆర్‌సీఈ) 2017-18 ధరల ప్రకారం పోలవరం ప్రాజెక్టు కోసం అయ్యే రూ.55,656 కోట్ల వ్యయాన్ని ఆమోదించాలని విన్నవించారు. పోలవరం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఖర్చులో ఇంకా రూ.1,779 కోట్ల మేర రీయింబర్స్ చేయాల్సి ఉందని, 2018 డిసెంబర్‌కు సంబంధించిన ఈ బిల్లులు

తరువాయి 2లో..

## రజనీ ఆరోగ్యంపై మరో హెల్త్ బులెటిన్



హైదరాబాద్: అగ్ర కథానాయకుడు రజనీకాంత్ ఆరోగ్యం నిలకడగా ఉందని అపోలో వైద్యులు తెలిపారు. రక్తపోటులో హెచ్చు తగ్గుల కారణంగా చికిత్స నిమిత్తం రజనీ ఆస్పత్రిలో చేరిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం అపోలో ఆస్పత్రి వర్గాలు ఆయన ఆరోగ్యంపై హెల్త్ బులెటిన్ విడుదల చేశాయి.

"రజనీకాంత్ ఆరోగ్యం నిలకడగా ఉంది. కొన్ని వైద్య పరీక్షల నివేదికలు రావాల్సి ఉంది. ఇప్పటివరకూ చేసిన వైద్య పరీక్షల్లో ఎలాంటి ఆందోళన లేదు. వైద్య పరీక్షల నివేదికలు చూసి రేపు రజనీకాంత్‌ను డిశ్చార్జి చేస్తాం" -అపోలో ఆస్పత్రి వర్గాలు

తరువాయి 2లో..






## ఇళ్ల పట్టాలపై స్టే తెచ్చిన వారంతా ఉపసంహరించుకోండి

### ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్



తాడేపల్లి : విప్లవాత్మక ఆలోచన చేసి పేదలందరికీ ఇల్లు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే చెందుతుందని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన శనివారం మాట్లాడుతూ.. ఇళ్ల పట్టాల పంపిణీ కేవలం సంక్షేమ కార్యక్రమం కాదని, ఒక ఆర్థిక కార్యక్రమం కూడా అని పేర్కొన్నారు. దీని ద్వారా ఎంతో మందికి ఉపాధి కలగనుందని తెలిపారు. కరోనా పరిస్థితుల్లో సంక్షేమం అందిస్తూ ఆర్థిక పరిపుష్టికి కృషి చేస్తున్నారు. దీని ద్వారా 20 కోట్ల మందికి పనిదినాలు దొరుకుతాయన్నారు. దీనిని టీడీపీ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారని విమర్శించారు. వారు జీవితంలో ఇలాంటి విప్లవాత్మక కార్యక్రమం చేపట్టారా.. అని ప్రశ్నించారు. అసలు ఒక సెంటు స్థలం అయినా ఇవ్వని వారికి ఈ రోజు విమర్శించే హక్కు ఉందా అని మండిపడ్డారు. అమరావతిలో పేద వారికి ఇల్లు ఇస్తామంటే సామాజిక అసమతుల్యత అన్నది మీరు కాదా. మీకు చిత్త శుద్ధి ఉంటే.. ఎలాంటి దురుద్దేశం లేకపోతే ఆ కేసును ఉపసంహరించుకోండి. పేదలకు ఇళ్ళు ఇద్దాం.ఇల్లు అనేది ఒక ఆత్మగౌరవం...సామాజిక స్థితి పెరుగుతుంది...అది మీకు ఇష్టం లేదా...? ఈ ఇళ్ల కోసమే కదా ఆందోళనలు చేసింది. ఒక ముఖ్యమంత్రి నేను ఇస్తాను అంటే వ్యతిరేకిస్తారా. కనీసం ఇలాంటి పోరాటాలు చేసిన కమ్యూనిస్టులు అయినా అభినందలు తెలపండి.

ఇళ్ల పట్టాలపై స్టే తెచ్చిన వారంతా ఉపసంహరించుకోండి. లేదంటే మీరు చరిత్ర హీనులుగా మిగులుతారు. మీరు రైతులను బెదిరించి భూములు తీసుకున్నారు...మా జగన్ గారు చట్టప్రకారం 2013 యాక్ట్ ప్రకారం సేకరించారు. చదవండి: సొంతింటి కల సాకారం



శృంగవరపుకోట భారతీయ జనతా పార్టీ శనివారం డాక్టర్ దగ్గుబాటి పురందేశ్వరి జాతీయ ప్రధాన కార్యదర్శి గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత విశాఖపట్నం వచ్చిన సందర్భంగా ఆమెను శృంగవరపుకోట నియోజకవర్గం తరపున అభినందనలు తెలిపారు. శృంగవరపుకోట నియోజకవర్గ కన్వీనర్ సిహెచ్ఆర్ కె ప్రసాద్ .మరియు శృంగవరపుకోట మండల అధ్యక్షులు ఎస్ ఆర్ వి రూపేష్. కొత్తవలస మండల అధ్యక్షులు సిహెచ్ అప్పారావు. ఎల్ కోట మండల అధ్యక్షులు బి సత్యనారాయణ. శృంగవరపుకోట కోశాధికారి పూడి రాజు. సీనియర్ నాయకులు ఎలమంచిలి ప్రసాద్ కలసి ఆమెకు అభినందనలు తెలియజేశారు.

## తాటాకు చప్పుళ్లకు భయపడను : వెలగపూడి



విశాఖపట్నం : విశాఖపట్నంలో తెదేపా ఎమ్మెల్యేపై ఎంపీ విజయసాయిరెడ్డి ఆరోపణలు చేసిన నేపథ్యంలో తెదేపా, వైకాపా నాయకులు సవాళ్లు, ప్రతి సవాళ్లు విసురుకున్నారు. ఈ క్రమంలో ఇవాళ ఎమ్మెల్యే వెలగపూడి కార్యాలయం వద్ద ఉద్రిక్త వాతావరణ నెలకొంది. పెద్ద సంఖ్యలో తెదేపా కార్యకర్తలు అక్కడికి చేరుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ నేపథ్యంలో పార్టీ కార్యాలయానికి చేరుకున్న వెలగపూడి మాట్లాడారు. తాటాకు చప్పుళ్లకు తాను భయపడనని ఆయన స్పష్టం చేశారు. 'నేను విజయసాయిరెడ్డికి సవాలు విసిరితే మధ్యలో వీళ్లేవరు. నేను విజయసాయిరెడ్డిని ప్రమాణం చేయమన్నాను' అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎంతో నిజాయతీగా రాజకీయాలు చేస్తున్నానన్నారు. సింహాచలం వచ్చి ప్రమాణం చేయాలని వైకాపా నేతలు అంటున్నారని.. ఆ సవాలు స్వీకరిస్తున్నానని.. అక్కడ ప్రమాణం చేయడానికి విజయసాయిరెడ్డి వస్తారా.? అని ప్రశ్నించారు.

ఈ క్రమంలో వైకాపా నాయకురాలు విజయనిర్మల సాయిబాబా చిత్రపటంతో ఎమ్మెల్యే వెలగపూడి కార్యాలయానికి వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆమె వెనక్కి వెళ్లిపోయారు. విశాఖపట్నం తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు భూ ఆక్రమణలకు పాల్పడినట్లు ఎంపీ విజయసాయిరెడ్డి ఇటీవల ఆరోపణలు చేశారు.

ఈ నేపథ్యంలో మూడు రోజులుగా తెదేపా, వైకాపా నాయకుల మధ్య ప్రమాణ సవాళ్లు నడుస్తున్న విషయం తెలిసిందే.



# పేదలను టీడీపీ మోసం చేసింది..

## వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



విజయవాడ: సొంతింటి కల సాకారం చేసి పేదల బతుకులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 వేలు ఉచితంగా ఇస్తుందని తెలిపారు. 21వ డివిజన్‌లో 478 మందికి ఇళ్ల పట్టాలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తున్నామని తెలిపారు. సెంట్రల్ నియోజకవర్గంలో 30 వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఇల్లు లేనివారు ప్రతి మూడు నెలలకొకసారి ఇంటి కోసం పేరు నమోదు చేసుకోవచ్చని ఆయన సూచించారు. సెంట్రల్ నియోజకవర్గంలో బస్టాండ్ కూడా నిర్మిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో 7,210 మంది లబ్ధిదారులకు అమరావతిలో పట్టాలు సిద్ధం చేశామని ఆయన వెల్లడించారు. "పట్టాల పంపిణీని టీడీపీ కోర్టుకెళ్లి అడ్డుకుంది. టీడీపీ చేస్తున్న నీచ రాజకీయాలను ప్రజలు చూస్తున్నారు. టిడ్కో ఇళ్ల విషయంలో పేదలను టీడీపీ మోసం చేసింది. సీఎం జగన్ పేద ప్రజలకు అండగా ఉన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ప్రజలు హర్షం వక్తం చేస్తున్నారు. తీరు మార్చుకోకుంటే టీడీపీ ని ప్రజలు తరిమి కొట్టే రోజులు వస్తాయని" మల్లాది విష్ణు హెచ్చరించారు.

మొదటి పేజీ తరువాయి

# పోలవరంపై సానుకూల ధోరణిలో కేంద్రం

పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఇదే విషయంపై రాష్ట్ర అర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ సైతం పలుమార్లు ఢిల్లీ పర్యటనలో కేంద్రమంత్రులకు వినతిపత్రాలను సమర్పించారు.

రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం.. తాజా అధికారిక ప్రకటనలో 2017-18 ధరల ప్రకారం కేంద్రం ఆమోదించిన వ్యయం 55,548.87కోట్ల రూపాయలని వెల్లడించింది. ప్రాజెక్టుకు ఇప్పటివరకు 8614.16 కోట్ల రూపాయలు విడుదల చేయగా.. త్వరలోనే మరో 2234 కోట్ల రూపాయలు విడుదల చేస్తామని ప్రకటించింది. ఇప్పటి వరకు పోలవరం ప్రాజెక్టు కోసం 17,325 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొంది. జాతీయ ప్రాజెక్టు, ఆంధ్రప్రదేశ్‌కు ప్రాణాధారమైన పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కృతనిశ్చయంతో ఉన్న విషయం తెలిసిందే. ఇటీవల పోలవరం పనులన్నీ నిశితంగా పరిశీలించి.. 2021 చివరి నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం సవరించిన అంచనాలను ఆమోదించడంతో పోలవరం నిర్మాణం మరింత వేగవంతం కానుంది.

# అర్హులందరికీ ఇల్లు మంజూరు

ఇస్తారని కరెంట్, రోడ్లు, అంగనవాడి, త్రాగునీరు, డ్రైనేజీ లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. జిల్లాలో లక్ష 16 వేల మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేసి అందిస్తున్నామని, జీవీఎంసీ పరిధిలో లక్షా 75 వేల పట్టాలు మంజూరు చేసినప్పటికీ కోర్టు ఉత్తర్వుల మూలంగా అందించలేక పోతున్నట్లు తెలిపారు. బుడ్డి వలస గ్రామం లో కొత్తగా సచివాలయం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు తెలియజేశారు. గృహాలు మంజూరు నిరంతర ప్రక్రియని చెప్పారు.

లబ్ధిదారులు రంగాల ఉగాది, మందల ఆశ మాట్లాడుతూ ఇంత త్వరలో సొంత ఇల్లు సాకారం అవుతుందని తాము ఎప్పుడూ ఊహించలేదన్నారు. తమకు ఇంటి స్థలాన్ని అందిస్తున్న జగన్ మోహన్ రెడ్డి గారికి అధికారులకు మంత్రి గారికి ఎప్పటికి రుణపడి ఉంటామని ఆనందంతో చెప్పారు. మరో లబ్ధిదారు స్వర్ణలత వై.ఎస్.ఆర్. ముఖ్యమంత్రిగా వున్నప్పుడు ఫీజు రియంబర్సుమెంటు పొందామని ఇప్పుడు జగనన్న సి.యం.గా వచ్చినప్పుడు ఇంటి స్థలం పొందాన్నారు జగనన్న పేదల కోసం ఎన్నో పథకాలు పెట్టి ఆదుకొంటున్నారు. ముఖ్యమంత్రిగా చిరకాలం వుండాలని కోరుకుంటున్నాను.

ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె.పెంచల కిషోర్, తాహసీల్దారు శ్రీనివాసరావు ఎంపీడీవో చిట్టి రాజు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# రజనీ ఆరోగ్యంపై మరో హెల్త్ బులెటిన్

తమిళ సినిమా 'అన్నాత్తే' సినిమా షూటింగ్ కోసం ఈ నెల 13న హైదరాబాద్‌కు రజనీ వచ్చారు. నిత్యం షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ నెలాఖరుకల్లా షెడ్యూల్ ముగియనుంది. ఇటీవల సెట్‌లో నలుగురికి కొవిడ్ రావడంతో దర్శకుడు శివ షూటింగ్ నిలిపివేశారు. ముందు జాగ్రత్తగా ఈనెల 22న రజనీకాంత్ కూడా కరోనా పరీక్షలు చేయించుకోగా నెగెటివ్ వచ్చింది. అప్పటి నుంచి స్వీయ నిర్బంధంలో ఉంటున్నారు. ఇంతలో శుక్రవారం ఉదయం ఒక్కసారిగా అనారోగ్యం తలెత్తడంతో వెంటనే అపోలో ఆసుపత్రిలో చేరారు.

## దా'రుణ' యాప్‌ల మోసాలపై వీడియో విడుదల

వరంగల్: ఆన్‌లైన్ లోన్ యాప్‌లతో అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ ప్రజలకు సూచించారు. లోన్ యాప్‌లపై అవగాహన కల్పించేందుకు నూతనంగా రూపొందించిన వీడియో మెసేజ్‌ను ప్రమోద్‌కుమార్ ఆవిష్కరించారు. సులువుగా రుణాలు ఇస్తున్నారనే కారణంతో ప్రజలు రుణ యాప్‌లకు ఆకర్షితులవుతున్నారని, జాగ్రత్తగా ఉండాలని ఆ వీడియో ద్వారా తెలిపారు. వడ్డీల పేరుతో యాప్‌ల నిర్వాహకులు అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని అందులో పేర్కొన్నారు.

ముందస్తు ఒప్పందాన్ని దుర్వినియోగం చేస్తూ రుణ గ్రహీతల ఫోన్ల వ్యక్తిగత సమాచారాన్ని వినియోగిస్తున్నారని.. అలాంటి చర్యలు చట్టరీత్యా నేరమని సీపీ స్పష్టం చేశారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుమతులున్న బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల వద్ద మాత్రమే రుణాలు తీసుకోవాలన్నారు. యాప్‌ల ద్వారా లోన్లు తీసుకొని చిక్కుల్లో పడొద్దని సూచించారు. రుణాల విషయంలో వేధింపులకు గురైతే డయల్ 100 లేదా వరంగల్ పోలీసు కమిషనరేట్ వాట్సాప్ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

# నువ్వేంటి.. నీ స్థాయేంటి : అమర్‌నాథ్



విశాఖపట్నం : వంగవీటి మోహనరంగ హత్య కేసులో నిందితుడైన వెలగపూడి రామకృష్ణ అక్రమాలేమిటో విశాఖ ప్రజలకు తెలుసని అనకాపల్లి ఎమ్మెల్యే గుడివాడ అమర్‌నాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ' నువ్వేంటి.. నీ స్థాయేంటి?.. నీ స్థాయికి విజయసాయిరెడ్డి ప్రమాణానికి రావాలా?' అంటూ మండిపడ్డారు. నేడు 11 గంటలకు సాయిబాబా ఆలయానికి వస్తానని, వెలగపూడికి దమ్ముంటే సాయిబాబా ఆలయానికి రావాలని సవాల్ విసిరారు. వెలగపూడి అక్రమాలపై తమ వద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. " విజయసాయిరెడ్డిపై మీరు అక్రమ కేసులు పెట్టారని ఏనాడో నిరూపితమైంది. వెలగపూడి అక్రమాలు ప్రజలందరికీ తెలుసు. విశాఖ పారిపోయి వచ్చినప్పుడు నీ ఆస్తి ఎంత?. నీ ఆస్తుల వివరాలు చెప్పగలవా?. హత్య కేసులో ఉన్న వ్యక్తులు విశాఖలో రాజకీయాలు చేస్తున్నారు.

వాగు పోరంబోకు భూమిని అక్రమంగా రెగ్యులరైజ్ చేసేందుకు ప్రయత్నించలేదా?. 225 గజాల వాగు పోరంబోకు భూమిని వెలగపూడి ఆక్రమించాడు.

టీడీపీ నేతల చెరలో ఉన్న 171 ఎకరాల ప్రభుత్వ భూమిని విడిపించగలిగాం. భూ కబ్జాదారులను విడిచిపెట్టే ప్రసక్తే లేదు. అమరావతిలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా టీడీపీ నేతలు కోర్టుకెళ్లారు.. పట్టణాల్లో ఉన్న పేదలకు కూడా సెంటు స్థలం ఇవ్వాలని సీఎం నిర్ణయించారు. విశాఖలో కూడా పేదలకు ఇళ్లు రాకుండా టీడీపీ నేతలు అడ్డుపడ్డారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల పట్టాల పంపిణీ పండుగ జరుగుతోంద"ని అన్నారు.

# భక్తి ఉద్యమంతో సామాజిక పరివర్తన : అమిత్ షా



గువాహటి: భక్తి ఉద్యమ పునరుద్ధరణతో అసోంలోని గ్రామాల్లో సామాజిక పరివర్తన తీసుకువస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. తద్వారా యువత ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలిసిపోతారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని సంప్రదాయ వైష్ణవ మఠాల్లోని నమ్‌ఘర్లకు కేంద్రం ఆర్థిక సాయం అందిస్తోందని, తద్వారా ఒక్కొక్కరికి రెండున్నర లక్షల రూపాయల చొప్పున మొత్తంగా 8 వేల మందికి లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఈశాన్య రాష్ట్రాల రెండు రోజుల పర్యటనలో భాగంగా అమిత్ షా శనివారం, కామరూప్ జిల్లాలోని అమిగావ్‌కు చేరుకున్నారు. అక్కడి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. "వేర్పాటు వాదులు పరిపాలిస్తున్న సమయంలో యువత చేతికి ఆయుధాలు ఇచ్చారు.

కానీ ఇప్పుడు ఆ గ్రూపులన్నీ జనజీవన స్రవంతిలో కలిసిపోయాయి. దేశ ఆర్థిక వ్యవస్థలో అసోం కూడా భాగమైంది. ఇక్కడ సాధించిన అతిపెద్ద విజయం బోడోలాండ్‌లో నమోదైంది. ఇటీవల అక్కడ జరిగిన ఎన్నికల్లో 80 శాతం పోలింగ్ నమోదైంది. ఒక్క చెదురుముదురు ఘటన కూడా చోటుచేసుకోలేదు. ఒక్క రక్తపు బొట్టు కూడా చిందలేదు. అయితే బోడోలాండ్ గెలుపు సెమీ ఫైనల్ మాత్రమే. ఇప్పుడు అంతిమ పోరుకు సిద్ధం కావాల్సి ఉంది. అసోం ఎన్నికల్లో పూర్తిస్థాయి మెజారిటీ సాధించాలి. సోనోవాల్- హిమంత నేతృత్వంలో ఇప్పటికే ఇక్కడ ఎన్నో అద్భుతాలు చోటుచేసుకున్నాయి. ఇక ముందు కూడా అదే కొనసాగుతుంది" అని అమిత్ షా పేర్కొన్నారు. 2021లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధం కావాలని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

ఇక కాంగ్రెస్ పార్టీపై విమర్శలు ఎక్కుపెట్టిన అమిత్ షా.. "మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అసోం నుంచి 18 ఏళ్లపాటు ఎంపీగా ప్రాతినిథ్యం వహించారు. కానీ రాష్ట్రానికి దక్కాల్సిన రూ. 8 వేల ఆయిల్ రాయల్టీ సమస్యను పరిష్కరించలేకపోయారు. మేం దానిని పూర్తి చేశాం" అని స్థానికులను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. కాగా తన పర్యటనలో భాగంగా సాంస్కృతిక, పర్యాటక అభివృద్ధికై ఉద్దేశించిన బటాద్రవ ధన్‌తో పాటు గువాహటిలో ఒక మెడికల్ కాలేజీ, తొమ్మిది లా కాలేజీల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు.

## ఆ ఇళ్లలో జగన్, మంత్రులు గంటైనా ఉండగలరా?

### ఏపీ తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ధ్వజం




అమరావతి: ప్రభుత్వం ఇచ్చిన 28లక్షల ఇళ్ల పట్టాల ప్రకటన మోసపూరితమని ఏపీ తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆరోపించారు. వాటిలో 70 శాతం నివాసముంటున్న సొంత స్థలానికి పొజిషన్ సర్టిఫికెట్ ఇచ్చి పట్టా ఇచ్చినట్లు మభ్యపెడుతున్నారని విమర్శించారు. తన నియోజకవర్గంలోని ఓ గ్రామంలో 38 మందికి పట్టాలు మంజూరు చేసినట్లు లెక్కల్లో చూపి ఏడుగురికి మాత్రమే ఇచ్చారని ఆరోపించారు. మిగిలిన 31 మందికి వారికున్న సొంత స్థలానికి పొజిషన్ ఇచ్చారన్నారు.

గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్న ఇళ్లు ఇవ్వకుండా నిరుపయోగమైన స్థలాలు ఇచ్చి ఏం లాభమని అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. ప్రభుత్వం ఇచ్చే స్థలంలో కట్టే ఇళ్లలో సీఎం జగన్, మంత్రులు ఓ గంటైనా ఉండగలరా? అని నిలదీశారు. అవినీతికి మార్గాలు వెతుక్కుని పథకాలు రూపొందిస్తున్నారని ఆయన ఆరోపించారు. దమ్ముంటే ఇళ్లపట్టాలపై సీబీఐ విచారణ జరిపించాలని అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు అన్ని ఇళ్లూ ఉచితమేనన్న జగన్.. ఇప్పుడు 300 గజాలు మాత్రమే ఉచితమంటూ మాటమార్చారని ఆరోపించారు.

## నాకు ప్రాణహాని ఉంది: వీహెచ్

హైదరాబాద్: తెలంగాణ పీసీసీ అధ్యక్ష పదవి విషయంలో అడ్డుతగులుతున్నానంటూ బెదిరింపు కాల్స్ వస్తున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు ఆరోపించారు. ఈ మేరకు ఆయన పోలీసులను ఆశ్రయించారు. తనకు ప్రాణహాని ఉందని రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీహెచ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## జింక్స్ అదరహో : సెహ్వాగ్

ఇంటర్నెట్‌డెస్క్: మెల్‌బోర్న్ వేదికగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న బాక్సింగ్ డే టెస్టులో తొలి రోజు భారత్‌దే ఆధిపత్యం. ఆతిథ్య జట్టును మొదటి ఇన్నింగ్స్‌లో టీమిండియా 195 పరుగులకే ఆలౌట్ చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన భారత్ మొదటి రోజు ఆట ముగిసేసరికి వికెట్ నష్టానికి 36 పరుగులు చేసింది. అయితే కంగారూలను కట్టడి చేయడంలో సారథి అజింక్య రహానె ఎత్తులు ఫలించాయి. ఆట ప్రారంభమైన 11వ ఓవర్‌కే అశ్విన్‌తో బౌలింగ్ చేయించడం, తొలి మ్యాచ్ ఆడుతున్న సిరాజ్‌కు ఆలస్యంగా బంతిని అందించడం విజయవంతమైంది. దీంతో మాజీ క్రికెటర్లు జింక్స్‌పై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. అలాగే సత్తాచాటిన బుమ్రా (4/56), అశ్విన్ (3/35), సిరాజ్ (2/40)ను కొనియాడుతున్నారు.

"బౌలింగ్‌లో మార్పులు, ఫీల్డర్లను మోహరించడంలో రహానె అద్భుతంగా పనిచేశాడు. బౌలర్లు అశ్విన్, బుమ్రా, సిరాజ్ అదరగొట్టారు. తెలివిగా బంతులు వేశారు. తొలి రోజు ఆస్ట్రేలియాను 195 పరుగులకే ఆలౌట్ చేశారు. ఇక తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సాధించడం బ్యాట్స్‌మెన్ చేతుల్లో ఉంది" - వీరేంద్ర సెహ్వాగ్

"మొదటి రోజు ఆట మాదే. బౌలర్లు గొప్ప ప్రదర్శన చేశారు. మంచి ముగింపు లభించింది" - విరాట్ కోహ్లీ

"టీమిండియాదే తొలి రోజు. బౌలర్లు మరోసారి సంచలన ప్రదర్శన చేశారు. అరంగేట్ర మ్యాచ్‌లో సిరాజ్, గిల్ ఆత్మవిశ్వాసంతో ఆడారు. సారథిగా రహానె సత్తాచాటాడు. అడిలైడ్ టెస్టులోని లోపాలను పునరావృతం చేయలేదు" - వీవీఎస్ లక్ష్మణ్

"తొలి రోజు ఆట గొప్పగా సాగింది. మెల్‌బోర్న్ మైదాన సిబ్బందికి శుభాకాంక్షలు. ఎంతోకాలం తర్వాత మంచి పిచ్‌ను సిద్ధంచేశారు. ఇలాంటి పిచ్‌లు మరిన్ని చేయాలి. ఇక భారత బౌలర్లు చక్కని ప్రదర్శన కనబరిచారు. జట్టును రహానె గొప్పగా ముందుకు నడిపించాడు. మొత్తం టీమిండియా బ్యాటింగ్ చేయగలదా?" - షేన్ వార్న్

## ఇండియన్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో 'మెగా క్రికెట్ టోర్నీ'




విశాఖపట్నం : ఇండియన్ బ్యాంక్ జోనల్ ఆఫీసు మరియు ఇండియన్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో మెగా క్రికెట్ టోర్నమెంటును జోనల్ మేనేజర్ రామ్ కుమార్ దాస్, డిప్యూటీ జోనల్ మేనేజర్ సందీప్ పట్నాయక్ మధుర వాడలోని బిట్స్ ఇంజనీరింగ్ క్రికెట్ గ్రౌండ్ లో ప్రారంభించారు. ఈ యొక్క టోర్నమెంట్ 26&27 డిసెంబర్ 2020 రెండు రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందని బ్యాంక్ ఆఫీసర్లు అందరూ తమ యొక్క క్రీడా స్ఫూర్తిని, నైపుణ్యంను చూపించి ఆహ్లాదకరంగా విజయవంతం చేయాలని వారు కోరుకున్నారు. అదేవిధంగా ఇతర ముఖ్య అతిధులుగా ఐబిఓఏ ప్రెసిడెంట్ కెటికెఎన్‌వి ప్రసాదు, జనరల్ సెక్రటరీ జి.సతీష్ చంద్రకుమార్ విజేతలకు బహుమతులను అందచేస్తారు. మరియు ఈ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిం చడంలో ముఖ్య భూమిక పోషించిన ఐబిఓఏ జోనల్ సెక్రటరీ టి. శివప్రసాద్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ యొక్క కార్యక్రమంలో అత్యధిక పరుగులు, వికెట్లు తీసిన క్రీడాకారులకు ప్రత్యేక బహు మతులను ఇవ్వడం జరిగింది. మరియు అధిక సంఖ్యలో బ్యాంక్ ఉద్యోగులు అందరూ పాల్గొని క్రీడాకారులందరిని ప్రోత్సహించాలన్నారు.

## డాక్టరేట్‌లను ప్రధానం చేసిన డా.పురంధేశ్వరి



గాజువాక : జిల్లా బీజేపీ అధ్యక్షులు మేడపాటి.రవీంద్ర ఆధ్వ ర్యంలో జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ కేంద్ర మంత్రివర్యులు బీ.జే.పి జాతీయ ప్రధాన కార్యదర్శి డా.దగ్గుబాటి పురంధేశ్వరి చేతుల మీదుగా బీజేపి గాజు వాక నియో జకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగ రావు బావ అమరపిన్ని రామా రావు ముగ్గురు కుమారులు అమర పిన్ని చానుక్య, లేఖజ్, లోహిత్ లకు ఉత్తమ విద్యార్థి, అంతర్జాతీయ స్థాయి క్రీడలలో రాణించినందుకు లండన్ యూనివర్సిటీ గుర్తించి కరోనా కారణంగా కొరియర్లో పంపించిన గౌరవ డాక్టరేట్ సర్టిఫికేట్, మెడల్సు లను ప్రదానంచేసి అభినందించారు. నగరంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విశాఖ పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పొలిమేర శ్రీనివాసరావు



ములగాడ: పశ్చిమ నియోజకవర్గం జీవీఎంసీ 59 వార్డు నక్కవానిపాలెం ప్రాంతానికి చెందిన బీజేపీ నాయకులు పొలిమేర శ్రీనివాసరావు విశాఖ పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితు లయ్యారు. ఈమేరకు ఆయనకు శనివారం పలువురు అభినందనలు తెలియజేశారు. విశాఖ పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించినందుకు రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు,ఎమ్మెల్సీ ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాధవ్ కు, మాజీ పార్లమెంట్ సభ్యులు శ కంభంపాటి హరిబాబు కి, రాష్ట్ర ఇన్చార్జ్ సునీల్ దియోధర్ కి, రాష్ట్ర సంఘటన కార్యదర్శి మధుకర్ జీ కి,విశాఖ పార్లమెంటరీ నగర అధ్యక్షులు మేడపాటి రవీందర్ కి ధన్యవాదాలు తెలియజేశారు.

పార్టీకి నిర్మాణాత్మక, క్రియాత్మకంగా ,కార్యాచరణతో సంసిద్ధుడనై ఎల్లప్పుడూ పని చేస్తానని, తనకు ఏ పని అప్పజెప్పిన పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా కృషి చేస్తానని అన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో బరిలో ఉన్న అభ్యర్థులను, గెలిపించేందుకు కృషి చేస్తానని తెలియజేశారు.

## ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థినులు ప్రతిభ




భీమునిపట్నం : ఇటీవల నిర్వహించిన స్కాలాస్టిక అసెస్మెంట్ టెస్ట్(ఎస్.ఎ.టి) లో తగరపువలస దగ్గర ఉన్న ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థినులు ఎస్. ప్రకీర్తి, వర్షిత లు ప్రతిభ సాధించినట్లు ఓక్రిడ్జ్ పాఠశాల డైరెక్టర్ అమిత్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. వీరు ప్రస్తుతం ఐబి డిప్లొమా ప్రోగ్రాం అభ్యసిస్తున్నారనీ ఇందులో ప్రకీర్తి 1600మార్కులు గాను 1560 మార్కులు సాధించినట్లు, సిబిఎస్ సి విద్యార్థికి 1600 మార్కులు కు గాను 1550 మార్కులు సాధించి ప్రపంచ వ్యాప్తంగా 99 ర్యాంకు లో నిలిచి నట్లు చెప్పారు.అంతేకాకుండా ప్రకీర్తి గణితం లో 800 మార్కులు కు గాను 800 మార్కులు, సాక్ష ఆధారిత పఠనం, ఆంగ్లంలో రాయడం లో 800మార్కులు కు గాను,760 మార్కులు సాధించినట్టు చెప్పారు. ఐబి ఓక్రిడ్జ్ విద్యార్థిని కావడంతో తనతో పాటు ఉపాధ్యాయులు కృషి తోడైందనీ అన్నారు. పరీక్ష కు 962మంది హాజరవగా 9వ ర్యాంకు సాధించిన వర్షిత ఐఐఎం, ఇండోర్ కు హాజరవుతుందనీ చెప్పారు. ఆమె అమెరికా కార్నెల్ విశ్వవిద్యాలయం కు వెళ్ళాలనీ అనుకుంటు న్నట్లు డైరెక్టర్ తెలిపారు. వర్షిత ఈ విధంగా ర్యాంకు తెచ్చుకోవడం చాలా గర్వంగా ఉందని, నిర్ధిష గమ్యం చేరుకోవాలంటే నిరంతరం కృషి చేయాలని ఆయన అన్నారు.

## రోడ్డు ప్రమాదంలో తల్లి, కుమారుడు మృతి


మృతురాలు అచ్చియ్యమ్మ

సబ్బవరం : మండల కేంద్రమైన సబ్బవరం సంత దగ్గర శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడు అక్కడిక్కడే మృతి చెందగా, అతని తల్లికి తీవ్ర గాయాల పాలవడం తో కె జి హెచ్ కు తరలించగా మృతి చెందినది. పోలిసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లి మండ లం కోడూరు గ్రామనికి చెందిన అన్నదానపు అప్పలరాజు (40), అతని భార్య అచ్చియ్యమ్మ (35)కవల పిల్లలు రామ లక్ష్మణల తో కలసి స్వగ్రామమైన కె. కోటపాడు మండలం వారాడ గ్రామం లో జరుగుతున్న వైయస్సార్ ఇళ్ల స్థల పట్టాల పంపిణి కార్యక్రమానికి వెళ్లారు. బైక్ పై వెళ్లిన వారు తిరుగు ప్రయాణంలో సబ్బవరం సంతలో కూరగాయలు కొనుక్కొని బైక్ పై కోడూరు తిరుగు ప్రయాణం లో వెళ్తుండగా పెందుర్తి నుండి అనకాపల్లి వెళ్తున్న లారీ వెనుక నుండి డీ కొనడం తో బాలుడు రాముడు అక్కడికక్కడే మృతి చెందగా, తల్లి అచ్చియ్యమ్మ కెజిహెచ్ కు తరలిస్తుండగా మార్గ మద్యం లో మృతి చెందింది. మృతురాలి భర్త అప్పల రాజు, మరో కుమారుడు లక్ష్మణుడు కు స్వల్ప గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ. చంద్రశేఖర్ తెలిపారు.


మృతుడు బాలుడు

## వంగవీటి రంగా కు ఘన నివాళులు


నర్సీపట్నంలో రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో.. నివాళులు

నర్సీపట్నం : పట్టణంలో మిత్రమండలి అధ్వర్యంలో స్వర్గీయ వంగవీటి మోహనరంగా వర్ధంతి కార్యక్రమం లో ముఖ్య అతిథి గా మీసాల సుబ్బన్న పాల్గొన్నారు. వైసీపీ నాయకులు మీసాల సత్యనారాయణ, నంగిన రమణ, నంబూరి సత్తిబాబు, జనసేన నాయకులు అద్దేపల్లి గణేష్,ముత్యాల శివ రంగమిత్రమండలి సభ్యులు, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు

## ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం



కొయ్యూరు : కొయ్యూరులో శనివారం సిపిఐ పార్టీ 95వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ శ్రేణులంతా కలిసి సిపిఐ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పొట్టిక సత్య నారాయణ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరం పోరాడుతున్న పార్టీ సిపిఐ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఇరువాడ దేవుడు, కునిశెట్టి దివాణం, గండేపల్లి నూకరాజు, మెల్ల నాగరాజు, వి.రాజు, ఉల్లి రాజుబాబు, పెంటయ్య, కృష్ణ, మాజీ ఎంపిటిసి సుర్ల కొండబాబు, మాదల సత్యనారాయణ, దేవరాపల్లి మహేంద్ర పాల్గొన్నారు.

## కూడా కృష్ణారావు నియామకంపై హర్షం

కొయ్యూరు : బిజెపి గిరిజన మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కూడా కృష్ణారావును నియామకంపై హర్షం వ్యక్తం చేస్తున్నామని బిజెపి మండలాధ్యక్షులు మురుకుర్తి అప్పలరాజు, కొయ్యూరు జెడ్పీటీసీ అభ్యర్థి కూడా నూకరాజు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. కూడా కృష్ణారావు 25 సంవత్సరాల నుండి ఎన్జీవోలో పని చేసి గిరిజన చట్టాలు, గిరిజన సమస్యలు, గిరిజన సంస్కృతిపై అపారమైన అవగాహన ఉన్నవారికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి ఇవ్వడం గిరిజనుల అందరికీ మేలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రీమేల చందరరావు, మచ్చుల మంగళతల్లి, దేపూరి రాజుబాబు, గోవింద్, సోమునాయుడు, కొర్రు నూకరాజు, ఎన్.సత్తిబాబు, దేముడు, రాజేరావు పాల్గొన్నారు.

## గిరిజన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

### - మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్



పాడేరు : డుంబ్రిగూడ మండలం లో అరకు గ్రామంలో రైతులతో సమావేశం అయిన అనంతరం మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ గిరిజన రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని గిరిజనులు పండిస్తున్న పంటలు కాఫీ. వరి. పసుపు. మొదలగు ఇతర అటవీ ఉత్పత్తులను కూడా మద్దతు ధర కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని గిరిజన ప్రాంతంలో కూరగాయలు పండిస్తున్నారు గిరిజన రైతులకు ఉచితంగా విత్తనాలు ఎరువులు వ్యవసాయ మోటార్లు సరఫరా చేయలేని దౌర్భాగ్య పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉందని ఇప్పటికైనా ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గిరిజన రైతులను ఆదుకునే విధంగా ఈ ప్రభుత్వం ముందడుగు వేయాలని మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ ఈ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గారి తో పాటు సుబ్బారావు. స్వామి. కొమ్ము నాయుడు. బాస్కరరావు. వెంకటరాజు. సాయిరాం. కావేర్ల పద్మ. మహేశ్వరి. పాండు రంగస్వామి. గోవర్ధన్ గోపాల్. తామర్ల సత్యనారాయణ. త్రినాధ్. సాగర్. మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు,

## కాలువల మరమ్మతులపై టీడీపీ నేత ఆగ్రహం




మధురవాడ : నాసిరాకం పనులతో సేవ రహదారిలో చేసిన కాలువల మరమత్తులు పనుల్లో జీవీఎంసీ అధికారుల తీరును 6 వ వార్డు టీడీపీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ ఎండగట్టారు. జీవీఎంసీ 6 వ వార్డు పరిధిలో చేపట్టిన ఫుట్ పాత్ మరమ్మత్తులు కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక పోయి నట్లుగా ఉందని, లక్షల రూపాయలు ఖర్చు పెట్టి చేసిన మరమ్మతులు వలన ప్రజలకు ఉపయోగం లేదని, నిత్యం కొన్ని వేల మంది పాదచారులు, వాహదారులు ప్రయాణించే కార్ షెడ్ కూడలి వద్ద చేపట్టిన ఫుట్ పాత్ మరమ్మత్తులు రెండు రోజులకే అద్వానంగా మారిందని దీనిపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## పేద ప్రజలకు సొంతింటి కల సాకారం

### - పెందుర్తి ఎమ్మెల్యే అధీప్‌రాజు



సబ్బవరం : పేద ప్రజల కోసం సొంతింటి కలను రాష్ట్ర ముఖ్యమంత్రి నెరవేర్చారని పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజు పేర్కొన్నారు. మండలంలోని మల్లు నాయుడు పాలెం గ్రామంలో శనివారం ఇళ్ల పట్టాలు పంపిణీ కార్యక్రమం జరిగింది ఎమ్మెల్యే అదీప్ రాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొని పేద వారికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు అనంతరం ఇళ్ల నిర్మాణం కోసం ఎమ్మెల్యే అదీప్ రాజ్ భూమి పూజ చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు పాదయాత్రలో ఇచ్చిన హామీలను 95శాతం నెరవేర్చారు అన్నారు రాష్ట్రంలో 30.75 లక్షల ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నామన్నారు కులం మతం పార్టీలు అతీతంగా ఇళ్ల పట్టాలు అర్హులైన వారం దరికీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నామన్నారు అనేక సంక్షేమ కార్యక్రమాలతో పాటు అభివృద్ధి కూడా చేస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ నారాయణమూర్తి, తుంపాల అప్పారావు, కొట్టన రాము, వైసిపి నాయకులు, కార్యకర్తలు, పళ్ళ కృష్ణ, గొంప దేముడు, బైలపూడి దేముడు, వైసీపీ మహిళా నాయకురాలు బంతి కోల పద్మ, డి పద్మ, తదితరులు పాల్గొన్నారు

# విజయభాను సంపాదకీయం

## నీతి కథలు.. జీవన రీతులు

చిన్నారులకు అనేక విషయాలు తెలియడానికి, వారిలో సృజనాత్మకత పెరగడానికి కథలు ఒక అద్భుతమైన విధానం. మన సాహిత్యంలో కథ అనే ప్రక్రియ ప్రాచీనమైనది.. కథలు చిన్నారుల్లో వినోదాన్ని, విజ్ఞానాన్ని పెంపొందిస్తూ వారిని ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దుతాయి.

చిన్నప్పుడు పిల్లలకు చెప్పే నీతి కథలు వారికి జీవిత పాఠాలవుతాయి. వారిని ఉన్నత సంస్కార వంతులుగా తీర్చిదిద్దుతాయి. పసి హృదయాలలో మానవ విలువలు, మంచి నడవడి, ఐకమత్య భావనలను పెంపొందిస్తాయి. సమయస్ఫూర్తి, మంచి చెడుల గురించి తెలియజేస్తుంటే వారు ఉన్నత వ్యక్తిత్వంతో, బాధ్యతాయుత పౌరులుగా రూపొందుతారు. 'అనగనగా ఒక రాజు'.. అని కథ చెప్పడం ప్రారంభించగానే పిల్లలు ఆ కథను వింటూ ఊహాలోకంలోకి వెళ్ళిపోతారు. సృజనాత్మకత రెక్కలు తొడుగుతుంది. అలాంటి కాల్పనిక భావనలే వారి ఆలోచనలకు పదునుపెడుతాయి.

కాలం మారుతుంటుంది.. జీవన విధానాలు మారుతుంటాయి. నిజమే. కానీ ఆ మార్పు ప్రాథమికమైన మానవ విలువలకు దూరం కారాదు. ఆ లంకె కొనసాగుతూనే ఉండాలి. తోటి మనుషుల పట్ల, సమాజం పట్ల ప్రేమ, బాధ్యత ఉన్నప్పుడే ఆ సమాజం సజావుగా కొనసాగుతుంది. లేదంటే అస్తవ్యస్తమవుతుంది. ఇప్పుడు విశ్వవ్యాప్తంగా పెనుమార్పులు చోటుచేసుకుంటున్నాయి. అస్తవ్యస్తమైన ఉమ్మడి కుటుంబాలు, తీరిక లేని పనులు, ప్రతి క్షణం డబ్బు కోసం ఆరాటం.. ఇలా జీవితం అంతా ఏమిటో తెలియని ఉరుకులు పరుగులమయమవుతున్నది.

ఈ నేపథ్యంలో పిల్లలు ఆదర్శప్రాయమైన జీవనానికి దూరం కాకూడదంటే, సాంస్కృతిక వారసత్వంగా వారికి అందుతున్న విలువలు కోల్పోకూడదంటే ఆ బాధ్యతను మొదట తల్లిదండ్రులు, తర్వాత పాఠశాలలోని ఉపాధ్యాయులు నెరవేర్చాల్సి ఉంటుంది. చిన్నారులకు కథలు ఎంత అవసరమో, తల్లిదండ్రులకు కూడా అంతే అవసరం. ఎందుకంటే కథలు చెప్పడం మనం ఆపేస్తే, అవి క్రమంగా అంతరించిపోతాయి. ఆ కథలతోపాటు మన అస్తిత్వం, మన చరిత్ర అంతరించిపోతుంది. భారతీయ చరిత్రలు, పురాణాలను పరిశీలిస్తే చిన్నతనంలో తల్లి చెప్పిన కథల వల్ల ప్రేరణ పొందామని ఎందరో గొప్పవారు తెలియజేశారు. చిన్నారులకు అనేక విషయాలు తెలియడానికి, వారిలో సృజనాత్మకత పెరగడానికి కథలు ఒక అద్భుతమైన విధానం. మన సాహిత్యంలో కథ అనే ప్రక్రియ ప్రాచీనమైనది. కథ అనే పదానికి కత అనేది వికృతి పదం. కొన్నిసార్లు ఉన్నవి లేనివి కల్పించి మాట్లాడితే కతలు చెప్పకు అంటుంటాం. అంటే అవి ఊహించి, కల్పించినవి అని అర్థం. ప్రముఖులు ఉపన్యాసాల్లో అప్పుడప్పుడు సందర్భానికి తగిన కథలను చెప్పేవారు. వాటిని పిట్టకథలనేవారు. కథలు చిన్నారుల్లో వినోదాన్ని, విజ్ఞానాన్ని పెంపొందిస్తూ వారిని ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దుతాయి.

ఒకప్పటి ఉమ్మడి కుటుంబవ్యవస్థ ఇప్పుడు లేదు. నేటి కుటుంబవ్యవస్థలో పిల్లలకు కథలు చెప్పేంత తీరిక ఎవరికీ ఉండటం లేదు. ఉద్యోగాలు చేసుకునే తల్లిదండ్రులు పిల్లలతో గడిపే సమయం కూడా తగ్గిపోతున్నది. లెక్క ప్రకారం, రోజుకు ఇంత అనే కేటాయింపులుంటున్నాయి. దీంతో ఈ హైటెక్ యుగంలో పిల్లలకు అందాల్సినంత ఆప్యాయత అందడం లేదు. కుదిరే ఆ తక్కువ సమయంలోనైనా పిల్లలతో అనుబంధాన్ని పెంచేందుకు కథలు చెప్పడం ఎంతగానో తోడ్పడుతుంది. గతంలో పనిభారం ఉన్నప్పటికీ తలిదండ్రులు రాత్రి సమయాల్లోనైనా తమ పిల్లలకు తప్పకుండా కథలు చెప్తుండేవారు. తల్లిదండ్రులు ముందుగా కథలను విని తమదైన హావభావాలతో పిల్లలకు చెప్పగలిగితే బాగుంటుంది. విశ్వవ్యాప్తంగా ఖ్యాతిగాంచిన మన కథలలో పంచతంత్ర కథలు, పేదరాశి పెద్దమ్మ కథలు, మర్యాద రామన్న కథలు, భట్టి విక్రమార్క కథలు, భేతాళ కథలు, కాశీమజిలీ కథలు, జానపద కథలు ముఖ్యమైనవి. మహాభారతం, రామాయణం, భాగవతంలో కూడా అనేక కథలున్నాయి. ఇతిహాస పురాణాల్లోని కథలు చిత్రవిచిత్రమైన మహిమలతో, మలుపులతో, వినోదభరితంగా ఉండి మంచి నడవడికను తెలియజేస్తాయి.

ప్రాచీన భారతీయ కథకుల సృజనాత్మకతకు, ఊహాశక్తికి, కథాకథనానికి సాటిలేని మేటి ఉదాహరణగా ఎన్నో కథలు నిలిచాయి.

## పవన్ ఒక్కడే నా పాత్రకు సెట్ అవుతాడు : చిరు



హైదరాబాద్: చిరంజీవి కథానాయకుడిగా నటించిన పవర్‌ఫుల్ యాక్షన్ కథా చిత్రం 'ఠాగూర్'. తమిళ చిత్రం 'రమణ' రీమేక్ తెరకెక్కిన ఈ సినిమాకి వి.వి.వినాయక్ దర్శకత్వం వహించారు. 2003లో విడుదలైన 'ఠాగూర్' బాక్సాఫీస్ వద్ద అత్యధిక వసూళ్లను రాబట్టి చిరు కెరీర్‌లోనే ఓ సూపర్‌హిట్‌గా నిలిచింది. అయితే, ఒకవేళ 'ఠాగూర్' చిత్రాన్ని రీమేక్ చేయాల్సి వస్తే అందులో హీరోగా తన తమ్ముడు పవన్ కల్యాణ్ అయితే సరిగ్గా సరిపోతారని చిరు అభిప్రాయపడ్డారు. 'ఠాగూర్' ఒక్కటే కాకుండా తన కెరీర్‌లో సూపర్‌హిట్ చిత్రాలుగా చెప్పుకునే 'జగదేకవీరుడు అతిలోక సుందరి', 'ఛాలెంజ్', 'రౌడీ అల్లుడు', 'గ్యాంగ్ లీడర్', 'ఇంద్ర' సినిమాలకు ఇప్పటితరం హీరోల్లో ఎవరు సూట్ అవుతారో చిరు తెలియజేశారు. ఆయన చెప్పిన దాని ప్రకారం.. 'ఇంద్ర'కి ప్రభాస్, 'ఛాలెంజ్'కి అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ, 'రౌడీ అల్లుడు'కి బన్నీ, రవితేజ, 'గ్యాంగ్ లీడర్'కి చరణ్, తారక్, 'జగదేకవీరుడు..'కి మహేశ్‌బాబు, చెర్రీ, తారక్, 'విజేత' చిత్రానికి నాగచైతన్య చక్కగా నప్పుతారని వివరించారు. అంతేకాకుండా తన ఆల్‌టైమ్ ఫేవరెట్ 'స్వయంకృషి'ని రీమేక్ చేస్తే తాను మాత్రమే సెట్ అవుతానని 'సామ్‌జామ్' కార్యక్రమంలో చిరు పేర్కొన్నారు.

## ఎన్డీయేకు మరో పార్టీ షాక్!



దిల్లీ: భాజపా నేతృత్వంలోని ఎన్డీయే కూటమి నుంచి మరో పార్టీ వైదొలిగింది. రాజస్థాన్‌లోని హనుమాన్ బేనీవాల్ నేతృత్వంలోని రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ (ఆర్‌ఎల్‌పీ) కూటమి నుంచి బయటకొచ్చింది. నూతనంగా తీసుకొచ్చిన రైతు చట్టాలను వ్యతిరేకిస్తూ కూటమి నుంచి వైదొలుగుతున్నట్లు బేనీవాల్ ప్రకటించారు. రైతులకు వ్యతిరేకంగా వ్యవహరించేవారి పక్షాన తాము ఉండబోమని తెలిపారు. రాజస్థాన్‌లోని ఆల్వార్ జిల్లాలో నిర్వహించిన రైతుల ఆందోళన కార్యక్రమంలో ఈ మేరకు బేనీవాల్ ప్రకటన చేశారు.

భాజపా నుంచి వైదొలిగిన బేనీవాల్.. 2018లో రాష్ట్ర ఎన్నికలకు ముందు ఆర్‌ఎల్‌పీని స్థాపించారు. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో భాజపాతో పొత్తు పెట్టుకుంది. అప్పటి నుంచి కూటమిలో కొనసాగుతోంది. ఇప్పటికే మహారాష్ట్రలోని శివసేన ఎన్డీయేకు దూరం అవ్వగా.. వ్యవసాయ చట్టాలను వ్యతిరేకిస్తూ పంజాబ్‌లోని అకాలీదళ్ సైతం కూటమిని వీడింది. తాజాగా ఆర్‌ఎల్‌పీ కూటమిని వీడడంతో ఎన్డీయే నుంచి బయటకొచ్చిన పార్టీల సంఖ్య మూడుకు చేరింది.

## రష్యాలో 60ఏళ్లు పైబడిన వారికి స్పుత్నిక్ టీకా



మాస్కో: 60ఏళ్లు పైబడిన వారికీ ఇకపై స్పుత్నిక్ టీకాను అందించేందుకు రష్యా అనుమతించింది. రష్యాలో అత్యవసర వినియోగం కింద స్పుత్నిక్ వ్యాక్సిన్‌ను అక్కడి ఔషధ నియంత్రణ సంస్థ అనుమతిచ్చిన విషయం తెలిసిందే. ఇప్పటికే దాదాపు రెండు లక్షలమందికి పైగా టీకాను పంపిణీ చేశారు. వారిలో 60ఏళ్లు పైబడిన వారికి టీకాను అనుమతించలేదు. ఆ వయసు వారిపై ఈ టీకాను విడిగా పరీక్షించారు. ఈ ప్రయోగ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు నమోదు చేయడంతో రష్యా ఆరోగ్య శాఖ మంత్రి టీకాను అందరికీ అనుమతిస్తూ శనివారం ఆదేశాలు జారీ చేశారు. కాగా రష్యా ప్రభుత్వం 3 లక్షల స్పుత్నిక్ టీకాలను అర్జెంటీనాకు పంపారు. రష్యా వ్యాప్తంగా టీకా పంపిణీ కార్యక్రమం జరుగుతుండటంతో దేశంలోని అన్ని ప్రాంతాలకు ఇప్పటికే టీకాలను పంపారు. ఈ స్పుత్నిక్-వి టీకా ఎగుమతికి సంబంధించి రష్యా ఇప్పటికే చాలా దేశాలతో ఒప్పందాలు చేసుకుంది. ఇప్పటికే అర్జంటీనా, బెలారస్‌లు తమ దేశాల్లో స్పుత్నిక్ టీకా వినియోగాన్ని అనుమతించారు.

## రైతుల ఆవేదనను వినాల్సిందే: రాహుల్

దిల్లీ: కొత్త సాగు చట్టాల రద్దే లక్ష్యంగా ఆందోళన చేస్తున్న రైతుల ఆవేదనను ప్రభుత్వం ఆలకించాల్సిందేనని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. వారి ఆవేదనకు మట్టిలోని ప్రతి రేణువు ప్రతిస్పందిస్తోందని.. ప్రభుత్వం సైతం వినాల్సిందేనని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ట్విటర్ వేదికగా.. రైతుల ఆందోళనకు సంబంధించిన ఓ వీడియోను పోస్ట్ చేశారు. అంతకుముందు గురువారం కాంగ్రెస్ సీనియర్ నేతలు గులాం నబీ ఆజాద్, అధిర్ రంజన్ చౌధురితో కలిసి రాహుల్ గాంధీ.. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలిసిన విషయం తెలిసిందే. కొత్త వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని కోరుతూ లేఖ సమర్పించారు.

మరోవైపు కొత్త సాగు చట్టాలపై చర్చకు రావాలని రాహుల్ గాంధీకి కేంద్ర మంత్రి ప్రకాశ్ జావడేకర్ సవాల్ విసిరారు.

రైతులకు వీటి వల్ల ప్రయోజనం చేకూరుతుందో.. లేదో.. వివరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రైతులకు వాటిల్లే నష్టమేంటో రాహుల్ వివరించాలని సవాల్ చేశారు.

## కవి సమయం

### జీవితం

వర్తమానంలో జీవిస్తూ
భవిష్యత్తుకు పునాదులు వేసుకుంటూ
ఆశావహ దృక్పథంతో సాగడం అవశ్యం
ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు
ప్రణాళికలు, కార్యాచరణ, పట్టుదల,
క్రమశిక్షణ, ముందుచూపు అత్యావశ్యకం
మనోభావాలలో చైతన్యం
ఆలోచనలలో నూతనత్వం
ప్రవర్తనలో దివ్యత్వం
సంబంధిత రీతిలో ఆదర్శవంతమైన
నూతన నిర్ణయాల రూపకల్పన
భిన్నత్వంలో ఏకత్వం
జాతీయ సమగ్రత, సర్వజీవ సమానత్వం
ఉల్లాస, ఆనందభరితమైన జీవితం
అందరి లక్ష్యం, గమ్యం, ఆశయం

...కవితా రచన
సి.ప్రతాప్

## పంచాంగం

మాసం :మార్గశిర ; తిథి: త్రయోదశి తె.5.40; కృత్తిక ప.1.29; వర్జ్యము లేదు.

**ఆదివారం 27-12-2020**

**మేషం** : శ్రీవారు, శ్రీమతి వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది. విలువైన వస్తువుల కొనుగోళ్ళ నిమిత్తం ధనం బాగా ఖర్చు చేస్తారు. ఆస్తుల క్రయ విక్రయాలకు సంబంధించి అగ్రిమెంట్లు వాయిదా వేసుకోవాల్సి వస్తుంది. వాహనం ఇతరులకు ఇచ్చే విషయంలో లౌక్యంగా వ్యవహరించండి. బంధువుల రాక కొంత అసౌకర్యం కలిగిస్తుంది. **వృషభం** :కుటుంబ విషయాలపై దృష్టి సారిస్తారు. మీ యత్నాలు గుంభనంగా సాగించాలి. ఇంటా ఒయటా మీ మాట చెల్లుబాటు కాగలదు. కొబ్బరి, పండ్లు, పువ్వులు, చిరు వ్యాపారులకు లాభదాయకంగా ఉంటుంది. ఓర్పుతో సర్దుకు పోవ టానికి యత్నించండి. బంధువులు, సోదరుల మధ్య ఆత్మీయతలు నెలకొంటారు. **మిథునం** : బ్యాంకు డిపాజిట్లు దీర్ఘకాలిక పెట్టుబడులు అనుకూలం. కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటిపైనే శ్రద్ధ వహించండి. స్థిరచరాస్తుల విషయంలో ఒక నిర్ణయానికి వస్తారు. కిట్టని వారు మిమ్ములను తప్పుదారి పట్టించేందుకు యత్నిస్తారు. విద్యార్థినులకు ప్రేమ వ్యవహారాల్లో చుక్కెదురవుతుంది. **కర్కాటకం** : ఆర్థిక లావాదేవీలు, వ్యవహార ఒప్పందాల్లో జాగ్రత్త అవసరం. పోటీ పరీక్షలు, ఇంటర్వ్యూలలో అనుకూల ఫలితాలు సాధిస్తారు. బంధువులతో తగాదాలు ఒత్తిడి తప్పవు. ఒక స్థిరాస్తి కొనుగోలుకు అడ్డంకులు తొలగిపోగలవు. వస్త్ర వ్యాపారులు పనివారలను ఓ కంట కనిపెట్టుకుని ఉండటం శ్రేయస్కరం. **సింహం** : తలపెట్టిన కార్యక్రమాలు ఆలస్యంగా సాగుతాయి. ఉద్యోగస్థులు సమర్థవంతంగా పనిచేసి అధికారులను మెప్పిస్తారు. విద్యార్థునలు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది. కోర్టు వ్యవహారాలు మీరు కోరుకున్నట్లుగానే వాయిదా పడతాయి. నిరుద్యోగులు వచ్చిన అవకాశాన్ని తక్షణం వినియోగించుకోవాలి. **కన్య** : పెద్దలుగా మీ బాధ్యతలు నిర్వహిస్తారు. సభలు, సమావేశాల్లో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. ఎప్పుటి నుంచి వాయిదా పడుతున్న పనులు పునఃప్రారంభమవుతాయి. హామీలు, చెక్కుల జారీల్లో ఏకాగ్రత వహించండి. ఉద్యోగ రీత్యాదూర ప్రయాణాలు వాయిదా వేయాల్సి వస్తుంది. **తుల** : కళల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఇచ్చిపుచ్చుకొనే వ్యవహారాలు, రిజిస్ట్రేషన్లు అనుకూలిస్తాయి. ఉద్యోగస్తులకు బరువు బాధ్యతలు అధికం కావడంతో శ్రమాధిక్యత తప్పదు. ఆలయ సందర్శనాల్లో ఇబ్బందులు తప్పవు. ఏకాంతం కోసం చేయు ప్రయత్నాలు ఫలిస్తాయి. స్త్రీలకు స్వీయ ఆర్జన పట్ల ఆసక్తి, తగు ప్రోత్సాహం లభిస్తుంది. **వృశ్చికం** : ఆర్థిక విషయాల్లో ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తారు. ఉపాధ్యాయులకు, మార్కెటింగ్ రంగాల వారికి ఒత్తిడి అధికమవుతుంది. కాంట్రాక్టర్లకు ఇప్పటి వరకు వాయిదా పడుతున్న పనులు పునః ప్రారంభం కాగలవు. మీ సమర్థత, నిజాయితీలకు ప్రభుత్వము నుంచి మంచి గుర్తిపు, రాణింపు లభిస్తుంది. **ధనుస్సు** : వ్యాపారాల్లో ఆటుపోట్లను ధైర్యం ఎదుర్కొని లాభాల బాటలో నడిపిస్తారు. పలుకుబడి కలిగిన వ్యక్తుల సహకారం లభిస్తుంది. విద్యార్థులకు వేడుకలకు వేడుకలలో హడావుడి, చురుకుతనం అధికమవుతాయి. వైద్యులకు శస్త్ర చికిత్సల సమయంలో ఓర్పు, ఏకాగ్రత చాలా ముఖ్యం. ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు లభిస్తుంది. **మకరం** : దైవ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని అందరినీ ఆకట్టుకుంటారు. విద్యార్థులు బజారు తినుబండారాలు భుజించడం వల్ల అస్వస్థతకు లోనవుతారు. భార్యాభర్తల మధ్య అవగాహనాలోపం వల్ల సమస్యలు తలెత్తుతాయి. మీ కళత్ర మొండి వైఖరి మీకు ఎంతో ఆందోళన కలిగిస్తుంది. **కుంభం** : కొబ్బరి, పండ్లు, పూల వ్యాపారులకు లాభదాయకంగా ఉంటుంది. శత్రువుల సైతం ఆకట్టుకుని ముందుకు సాగుతారు. దూర ప్రయాణాల్లో వస్తువుల పట్ల మెళకువ అవసరం. రావలసిన బకాయిలు సకాలంలో అందిన ధనం ఏమాత్రం నిల్వ చేయలేరు. గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. **మీనం** :దైవ పుణ్య కార్యక్రమాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఉత్తర ప్రత్యుత్తరాలు సంతృప్తిని ఇస్తాయి. రుణాలు తీర్చడానికి చేయు యత్నాలు వాయిదా పడతాయి. ముఖ్యమైన పనులు మీరే చేసుకోవడం మంచిది. రాజకీయాల్లోని వారికి శత్రువులు అధికమవుతున్నారని గమనించండి. బంధువుల రాక కొంత అసౌకర్యం కలిగిస్తుంది.

# విశ్వసిస్తేనే భగవద్దర్శనం

## సంకీర్తన



భగవంతుడు సాధు రక్షణార్థం, ధర్మ సంస్థాపనార్థం ఏ రూపంలోనైనా గోచరించగలడు. అదే భగవంతుని అవతార విశిష్టత. ఆయనను సంపూర్ణంగా విశ్వసించకపోతే బాధపడక తప్పదు. విశ్వసిస్తే ఆత్మగత సంబంధం ఏర్పడుతుంది. దేవుడి శక్తి మనలో నిండి ఉంటుంది. కనుక అప్పుడు ఎవరిలోనైనా దైవత్వం కనపడుతుంది. ఇలాంటి భావం అందరిలో ఏర్పడకపోవడానికి కారణం, దేవుడు లేడని కాదు మనకు దేవుడు కనపడాలన్న కోరిక బలంగా లేకపోవడం. కోరికలు మహారాజును కూడా కటిక పేదవాడిగా మార్చ గలవు. కనుక భక్తులు కోరికలకు దూరంగా భగవంతుడికి దగ్గరగా ఉండేందుకు ప్రయత్నించాలి.

మనకు అవసరమైనవన్నీ భగవంతుడే అడక్కుండా సమకూరుస్తాడు.

మనం కోరుకున్న కోరికలలో ఏవైనా తీర లేదంటే అవి మనకు మేలు చేయనివని దేవునికి అని పించి ఉండాలి. అందుకే పరమాత్మ మనకు అనుగ్రహించలేదని తెలుసుకోవాలి. ఈనాడు భగవంతుని గురించి వినడానికి ప్రజలు తండోపతండాలుగా వస్తున్నారు.

అయినా వారిలోని అశాంతిని పారదోలుకోలేకుండా వున్నారు. ఎన్నో ఉపదేశాలు వింటున్నారు. ఎన్నో సేవా కార్యక్రమాలు వ్యక్తిగతంగా, సామాజిక పరంగా చేస్తున్నారు.

అయినా వారిలో శాంతి లేదు. వినడమొక్కటే సరిపోదు. భక్తితో భగవంతుడిని సేవించి నప్పుడే బ్రతుకు పునీతమవుతుంది. మనఃపూర్వకంగా భగవంతుణ్ణి ధ్యానించే వారికి అసంతృఎప్తి అనేది వుండదు.

తన గురించి మనకెంత తెలుసునని ఆయన ఆలోచించడు, ఆయనకోసం మనమెంత తపిస్తున్నా మనేదే ఆయన వీక్షణ. దేవుడు మన భక్తి విషయంలో సదా మేల్కొనేట్టుగా మన పూజలు వుండాలి. అంతేగానీ ఉన్నాడో లేడోనని పదిమందిని పోగేసి మీమాంసలు చేయవద్దు.

సంశయాత్ములకు భగవంతుడు సందేహాస్పదుడే! దైవ కార్యాలకు వచ్చే విఘ్నాలను దైవమే పోగొట్టాలి.

తన శక్తి పైన గాక పరమాత్మ శక్తి పైన ఆధారపడి జీవించే వాడు భక్తుడు. మూడవ నేత్రం ముక్కంటికే గాదు, మనుష్యులందరికీ ఉంది. అదే జ్ఞాన నేత్రం. ఎవరికి జ్ఞాననేత్రం తెరుచుకుంటుందో వారు గర్వాన్ని దగ్ధం చెయ్యగలరు.

సర్వం జ్ఞాన ప్లవే నైవ వృజినం సంతరిష్యసి జ్ఞానమనే తెప్పచే పాపరాశిని దాటగలవని శ్రీకృష్ణుడు గీతలో బోధించాడు.

భగవంతుని యందు సంపూర్ణ విశ్వాసం వుంచిన వాడికి జగమంతా వెలుగులే!

# బాలుడు వైద్యానికి పల్లా అప్పారావు చేయూత



పరవాడ : బాలుడు వైద్యానికి వైసిపినాయకులు పెదముషిడివాడ సర్పంచ్ అభ్యర్థి పల్లా అప్పారావు ఇరవైవేలు రూపాయలు అందజేసి నిరుపేదలు పట్ల మానవత్వం చాటుకున్నారు. వివరాలుకు వెళ్తే పరవాడ మండలము పెదముషిడివాడ గ్రామం, అంబేత్కర్ కొలనికి చెందిన 4 ఏళ్ల బాలుడు గుండె సంభందిత సమస్యతో ఉన్న బాలుడు పట్ల, మన ప్రియతమ నాయకులు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ దృష్టికి తీసుకుని వెళ్లి ఆ కుటుంబానికి వైద్య పరంగా దైర్యాన్ని కల్పించటం చేశారు. స్థానిక వైసిపి నాయకులు ప్రస్థుత ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం పల్లా అప్పారావు (కబ్బడీ) ఇరవై వేలు రూపాయలు అందజేసి నిరుపేద బాలుడుపట్ల మానవత్వం చాటుకున్నారు. గ్రామంలో కష్టము వచ్చిన ప్రతీ చోటా పల్లా(కబడ్డీ) అప్పారావు ముందుండి తనవంతుసేవలు అందజేస్తున్నారు. అయన చేసే సేవ దృక్పదానికి గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం


## నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్

మాకవరపాలెం : సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శమని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శనివారం మాకవరపాలెంలో 150 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శమని, ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా మాట తప్పని మడమ తిప్పని నాయకుడిగా రాష్ట్ర వ్యాప్తంగా 30లక్షల మందికి ఇళ్ల పట్టాలు, ఇంటి నిర్మాణాలకు శ్రీకారం చుట్టిన ఘనత ముఖ్యమంత్రికే దక్కిందన్నారు.

నర్సీపట్నం నియోజకవర్గంలో సుమారు 8250 మంది మహిళ అక్కచెల్లెమ్మలకు పట్టాలు పంపిణీ చేయడానికి సిద్దం చేశామన్నారు. అర్హులందరికి న్యాయం చేయడమే జగన్ ధ్యేయమని, ఇప్పటికే ఇస్తున్న లక్షల గృహాలలో లబ్ధిపొందని అర్హులు ఎవరైనా ఉంటే మరో 90 రోజుల్లో వారికి కూడా గృహాలు, భూపట్టాలు ఇచ్చేందుకు వైయస్సార్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

గత తెలుగుదేశ ప్రభుత్వ పాలనలో నర్సీపట్నం నియోజకవర్గంలో ఇళ్లు మంజూరు చేసి పూర్తికాని 2250 పక్కా గృహాలకు 7కోట్ల 27లక్షలను ముఖ్యమంత్రి మంజూరు చేశారని, వారికి కూడా వచ్చే నెలలో నగదును అందించనున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. 18 నెలల పాలనలో ప్రతీ ఒక్క అర్హునికి అనేక సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే అన్నారు.

ఈ కార్యక్రమంలో నర్సీపట్నం సబ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, తహశీల్దార్ రాణీఅమ్మాజి, ఎంపిడిఒ అరుణశ్రీ, వైసిపి మండలాధ్యక్షులు రుత్తల సత్యనారాయణ, నాయకులు సర్వం, వాసు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

# శ్రీ గాయత్రీ హెూమంతో వివేకానంద జయంతోత్సవాలు ప్రారంభం

## ఘనంగా..అన్నదానం..

విశాఖపట్నం : వన్టౌన్ శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో.. శ్రీ గాయత్రి హెూమంతో..శ్రీ స్వామి వివేకానందుని జయంతోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు జ్యోతి ప్రజ్వుళన.. చేసి ఉత్సవాలను ప్రారంభించారు.. వివేకానందుడు ఆదర్శప్రాయుడని కొని యాడారు. ఆయన అడుగుజాడల్లో.. నడుద్దామని పిలుపునిచ్చారు.

జయంతోత్సవాల్లో భాగంగా శనివారం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. నిరుపేద కుటుంబాలకు కూరగాయలు పంపిణీ చేశారు. జయంతి ఉత్సవాల్లో భాగంగా.. 19 రోజులపాటు భారీ స్థాయిలో.. సేవా కార్యక్రమాలు చేపట్టనున్నారు..

19 రోజుల పాటూ ప్రతిరోజు సాయంత్రం 500 మంది నిరుపేదలకు అన్నదానం చేయనున్నారు.

వివేకానంద జయంతి ఉత్సవాల్లో జరిగే కార్యక్రమాలు..

26న గాయత్రి హెూమం, 27న రామకృష్ణ పరమహంస జీవిత చరిత్ర చలనచిత్ర ప్రదర్శన

28న చిత్రలేఖనం పోటీలు.., 29న శ్రీ శారదా దేవి జీవిత చరిత్ర, చలన చిత్ర ప్రదర్శన 30న సిస్టర్ నివేదిత జీవిత చరిత్ర చలనచిత్ర ప్రదర్శన.., 1న ముగ్గుల పోటీలు.. 2న సంకీర్తన 3న సాగరతీరంలో.. " వివేకానంద నడక".. నగరంలో ఊరేగింపు..10 వరకు ప్రతిరోజు సంకీర్తన అన్నదానం, 11న మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం.. 12, 13 తేదీల్లో భారతీయ సాంప్రదాయ కళా కార్యక్రమాలు, మరియు సేవా కార్యక్రమాలు చేపడతారు.

# పురంధేశ్వరి ని కలిసిన నరేంద్రమోడీ సేవాసంఘం కన్వీనర్ సత్తరవు వాయునందనరావు



భీమునిపట్నం : శనివారం ఉత్తరాంధ్ర నరేంద్రమోడీ సేవా సంఘం కన్వీనర్ లయన్ డాక్టర్ సత్తరవు వాయునందనరావు జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించి విశాఖపట్నం విచ్చేసిన డాక్టర్ దగ్గుబాటి పురందేశ్వరి ని మొదటి సారి మర్యాద పూర్వకంగా కలిసారు.అంతేకాకుండా రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి ప్రేమ్ కుమారి చేతుల మీదగా ఉత్తరాంధ్ర నరేంద్రమోడీ సేవా సంఘం మాస్క్ లని ఓపెన్ చేశారు.

ఈ కార్యక్రమంలో

నగర యువ మోర్చా అధ్యక్షుడు విజయ శంకర్ ఫణి, 1 వార్డు నాయకురాలు డి.లీలావతి, 2 వార్డు ఉమ్మడి అభ్యర్థి గనివాడ పార్వతి తదితరులు పాల్గొన్నారు.




*భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన తర్వాత మొట్టమొదటిసారిగా విశాఖ విచ్చేసిన డాక్టర్ దగ్గుబాటి పురంధరేశ్వరి ని జీవీఎంసీ అంబియా 96వ వార్డు బిజెపి కార్పొరేటర్ అభ్యర్థి రామ నాయుడు కలిసి అభినందనలు తెలియజేశారు.*

# కొవిడ్ వారియర్స్‌కు ఘన సత్కారం

*- అందరి సహకారంతోనే అదుపుచేయగలిగాంః ఎఎంసి ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్*

*- నేవల్ డాక్‌యార్డ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహణ*





విశాఖపట్నం : కొవిడ్-19లో ప్రజలకు మెరుగైన సేవలందించినందుకుగాను ఉత్తరాంధ్ర కొవిడ్ ప్రత్యేక అధికారి,ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ సుధాకర్‌ను శనివారం నేవల్ డాక్‌యార్డ్ (కేటిబి) ఉద్యోగుల సంఘం ఎఎంసి కళాశాలలో ఘనంగా సత్కరించింది. సుధాకర్ విశేష సేవలందించారని సంఘం నేతలంతా కొనియాడారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ అందరి సహకారంతోనే కొవిడ్ నుంచి మెరుగ్గా బయటపడగలిగామని అన్నారు. ప్రజలు అందించిన సహకారంతో పాటు,ప్రభుత్వం కూడా సకాలంలో అన్ని చర్యలు చేపట్టిందని, దీంతో పాటు మీడియా కూడా ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ సమన్వయంగా పనిచేసిందన్నారు. దీనివల్ల ఉత్తరాంధ్రలో కొవిడ్‌ను సకాలంలో అదుపుచేయగలిగామన్నారు. ఇప్పటికి ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సుధాకర్ సూచించారు. ఇక పారిశుధ్య కార్మికులకు మెరుగైన సేవలందించి వారికి అండగా నిలిచినందుకు రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.ఆనందరావును సంఘం నేతలంతా ఘనంగా సత్కరించారు.

ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ తమ అసోసియేషన్ సభ్యులు సంక్షేమంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు.కొవిడ్ వారియర్స్‌ను సత్కరించుకోవటం తమ బాధ్యతగా బావిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బత్తుల చిరంజీవి,కార్యదర్శి భాస్కరరావు,ఇతర ప్రతినిధులు శ్రీనువాస్,గవర సోమశేఖర్, సన్యాసిరావు,బంగిన శ్రీనువాస్, చిన్నారావు, నాగార్జున, తేజ తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

### సిఐటియు ఆధ్వర్యంలో కరపత్రం ఆవిష్కరణ

విశాఖపట్నం : డిల్లీలో రైతులు చేస్తున్న ఆందోళన ఎందుకు చేస్తున్నారో, గడ్డకట్టే చలిలో కూడా ఎందుకు ఆందోళన చేస్తున్నారో,రైతులు ఏం కోరుకుంటున్నారో తెలియజేస్తూ సిఐటియు పెద్దాపురం మండల కమిటీ ఆధ్వర్యంలో కరపత్రంఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్షులు గడిగట్ల సత్తిబాబు మాట్లాడుతూ డిల్లీలో రైతన్నలకుఅండగా నిలవడం దేశభక్తియుతమైన ప్రతి పౌరుడి భాద్యత అని అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం చేస్తున్నటువంటి దుర్మార్గమైన విధానాలవల్ల రైతులు చాలా నష్టాలపాలవుతున్నారని అన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేసారు. కార్మిక కర్షక ఐక్యత వర్ధిలాలని కోరుతూ రైతుల ఆందోళనను వివరిస్తూ కరపత్రం విడుదల చేయడం జరిగిందని అన్నారు. చింతల సత్యనారాయణ, ఉమామహేశ్వరి, డి.క్రాంతికుమార్, ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మహాయజ్ఞంలా ఇళ్ల పట్టాల పంపిణీ

## నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్



పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్

నర్సీపట్నం : రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి మహాయజ్ఞంలా ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నారని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. శనివారం ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని గొలుగొండ మండల కేంద్రంలో చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇళ్ల పట్టాల పంపిణీతో పాటు రైతు భరోసా, జగనన్న విద్యాదీవెన, అమ్మ ఒడి వంటి ఎన్నో పథకాలు అందజేస్తున్నారన్నారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇల్లు నిర్మించుకోవడం కోసం ఒక లక్షా 80వేలను ఇవ్వడం జరుగుతుందన్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 19159 మందికి పట్టాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం సబ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, తహశీల్దార్ వెంకటేశ్వరరావు, వెలుగు ఏపిఎం గోవిందరావు, వైసిపి నాయకులు సుర్ల వెంకట గిరిబాబు, లెక్కల సత్యనారాయణ, సిహెచ్. భాస్కర్‌నాయుడు, మాకిరెడ్డి నాయుడు, సేనాపతి రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఫాబ్ ఆధ్వర్యంలోనేత్ర విద్యాలయంలో క్రిస్మస్ సంబరాలు

భీమునిపట్నం : ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి (ఫాబ్) ఆధ్వర్యంలో భీమిలి బీచ్ రోడ్డులో ఉన్న ఉన్న నేత్ర విద్యాలయంలో క్రిస్మిస్ సంబరాలు విద్యార్థినీ విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి క్రిస్టమస్ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్ర విద్యాలయానికి సౌండ్ సిస్టం, సిస్టం యాక్ససరీస్ మరియు ఫాబ్ జూనియర్ శ్రీ నిధి సహకారంతో విద్యార్థినీ విద్యార్థులకు హెడ్ ఫోన్స్, స్నాక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫాబ్ బెంగళూరు ప్రతినిధి మాదే ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ఈ సంవత్సరం క్రిస్మస్ సంబరాలను పిల్లల మధ్య జరగడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఫాబ్ సభ్యులు తమ కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. ఎంతో ఉత్సాహ భరిత వాతావరణం లో జరిగిన ఈ కార్యక్రమంలో నేత్ర విద్యాలయ విద్యార్థినీ విద్యార్థులు చక్కని పాటలతో అందరినీ అలరించారు.ఈ కార్యక్రమంలో విద్యాలయ వార్డెన్ పిల్లలు ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# హరివరాసనం పాట సీడీ ఆవిష్కరించిన శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి




విశాఖపట్నం : శనివారం ఉదయం పాడుతా తీయగా 2018 విజేత ధీరజ్, రంగసాయి నాటక గ్రంథాలయం వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయి, కళాకారులు నారా రాజు, డి.రాజేష్. శారదా పీఠంలో శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం శారద పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర స్వాములను దర్శించి పాద పద్మములకు నమస్కరించి వారి ఆశీస్సులు స్వీకరించారు. ఈ సందర్భంగా శారదా పీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహా స్వామి సువర్ణ హస్తాలతో ధీరజ్ పాడిన " హరివరాసనం" గీతం సిడిని ఆవిష్కరించారు.ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి కూడా పాల్గొని ధీరజ్ ని అభినందించారు. ఈ కార్యక్రమంలో హరివరాసనం పాట , మాణిక్యవీణ శ్లోకాన్ని ధీరజ్ ఆలపించగా స్వామీజీ ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి శుభాశీస్సులు పలుకుతూ కుటుంబ కళా వారసత్వం ఆగిపోకూడదని, కళల వారసత్వాన్ని కొనసాగించాలని హితవు పలికారు. తన ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని భవిష్యత్తులో మంచి గాయకుడవు అవుతావని స్వరూపానందేంద్ర స్వామి తెలియజేశారు.

# చెట్టుపల్లి లో పేదల స్థలాల్లో అవకతవకలు

## రెవెన్యూ తీరుపై జనసేన నాయకులు సూర్యచంద్ర సూటిప్రశ్న



నర్సీపట్నం : జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ సమన్వయకర్త రాజన్న వీర సూర్య చంద్ర ఈ విధంగా ఆరోపించారు నర్సీపట్నం మండలం చెట్టు పల్లి గ్రామంలో పేదలకు ఇచ్చే ఇంటి స్థలాలు అర్హుల జాబితా ఎంపిక ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ప్రధాన ఆరోపణ... విజయభాను ప్రతినిధి తో మాట్లాడుతూ..... గ్రామంలో నివసిస్తున్నటువంటి పేద ప్రజలకు కాకుండా వైసిపి పెద్దల చుట్టూ ఎవరైతే ప్రదక్షిణలు చేస్తున్నారో, వారి పేర్లు అర్హుల జాబితా లో ఉండేలా రెవెన్యూ అధికారి చోటు కల్పించడం జరిగిందని, అంతేకాక స్థానికంగా నివాసం లేని వారి పేర్లు కూడా అర్హుల జాబితాలో ఎంపిక చేశారని, అర్హుల జాబితాలో ఎంతమంది వైసిపి సానుభూతిపరులు ఉన్నారో.... ? ఎంతమంది వేరే పార్టీ వారు ఉన్నారు? ఎంతమంది అసలైన పేద అర్హులన్నారో అనే ప్రశ్నలకు సమాధానం చెప్పగలరా ??? అన్నారు. అర్హుల జాబితా సచివాలయంలో ఎందుకు ప్రదర్శించడం లేదు . ఇళ్ల స్థలాల విషయంలో అర్హులైన పేదలకు కాకుండా అర్హతలేని పేదలు ఉంటే ఊరుకునే ప్రసక్తే లేదు. చెట్టు పల్లి లో నివసించే ప్రజలు మాత్రమే అర్హుల జాబితా లో ఉండాలి లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తాం అన్నారు. కేవలం ప్రకటనలు మాత్రమే తప్ప, పార్టీ చూడమని చెప్తున్నారు కానీ అది ఆచరణలో లేదు అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు నర్సీపట్నం గ్రామీణ అధ్యక్షుడు చక్రవర్తి, పరవాడ లోవరాజు,మోపాడ చిరంజీవి. కే.శ్రీను, ఇన్నం రామచంద్ర , బంటు ప్రసాద్, కలిమి శ్రీను పాల్గొన్నారు.

# ఘనంగా ముక్కోటి ఏకాదశి పూజలు

*- నరసాపురంలో కన్నుల పండుగగా సింహాద్రి అప్పన్న కళ్యాణ మహోత్సవం*
*- గజపతినగరం లో సీతారాముల ఊరేగింపు ఉత్సవం, మేలుకొలుపులు*
*- నరసాపురం లో భారీ అన్నసమారాధన*



**నరసాపురంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణోత్సవం నిర్వహిస్తున్న భక్తులు**



**కల్యాణ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారు**



**సింహాద్రి అప్పన్నకు (తోటి పెద్ద) పూజలు చేస్తున్న సింహాద్రి అప్పన్న మాలధారులు**

చోడవరం : ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండలంలోని నరసాపురం గ్రామంలో సింహాద్రి అప్పన్న ఆలయంలో శుక్రవారం రాత్రి శ్రీ లక్ష్మీ సమేత నరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా కన్నుల పండువగా నిర్వహించారు.

స్థానిక జై శ్రీమన్నారాయణ పీఠం, గ్రామస్తులు వేదపండితుల ఆధ్వర్యంలో 20 మంది దంపతులు ఈ కళ్యాణ మహోత్సవం లో పాల్గొన్నారు. శనివారం ఉదయం సింహాద్రి అప్పన్న మాలధారులు స్వామివారికి విశేష పూజలు నిర్వహించి మధ్యాహ్నం గ్రామస్తులు భక్తుల ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిపారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాలైన రాయపు రాజుపేట, బుచ్చయ్య పేట తదితర ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

గజపతినగరంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా సీతా రామాలయం లో భక్తులకు స్వామివారి ఉత్తర ద్వారం దర్శనం కల్పించి, సాయంత్రం స్వామివారి ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కోవిడ్ వారియర్స్ హక్కుల పోరాట సమితి పిలుపు




పాడేరు : కోవిడ్- వారియర్స్ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఈ రోజుకి 6 రోజుకి చేరుకుంది. ఈ సంబం ధించి గౌరవ అధ్యక్షులు అమర్ మాట్లాడుతూ కోవిడ్- వారియర్స్ పది రోజుల పాటు ఉద్యమం చేస్తున్నప్పటికీ, అధికారులు గానీ ప్రభుత్వం గానీ పట్టించుకోక పోవడం చాలా దుర్మార్గం అని, ఆరు నెలలు పూర్తి కాకుండానే ఉద్యోగం నుండి తొలగించడం. నాలుగు నెలలు జీతాలు ఇవ్వకపోవటం , కనీసం సర్వీస్ సర్టిఫికెట్ అడిగితే మూడు నెలలకు ఎలా ఇస్తామని వారిని అవ మానించి వెనక్కి పంపించటం జరిగింది. కొన్ని హాస్పిటల్స్ వారికి రిలేవెడ్ అని పేపర్స్ ఇచ్చి పంపించటం జరిగిందని అన్నారు. కోవిడ్ సమయంలో ప్రజలందరూ భయం గుప్పెట్లో ఉన్నప్పుడు, ప్రజల ప్రాణాలు కాపాడుకోవడం కోసం వీరు యొక్క సేవలు ఉపయోగించుకున్నారని, వీరు ప్రాణాలు సైతం లెక్క చేయకుండా ప్రజల ప్రాణాలు కాపాడడం కోసం ప్రజా సేవ చేశారని అన్నారు. ఇప్పుడు వీరికి అవమానించి ఉద్యోగం నుండి తొలగించారని, ప్రైవేటు కార్పొరేట్ హాస్పటల్ లో పనిచేస్తున్న వీరు ప్రభుత్వ ఉద్యోగం దొరికింది అన్న ఆశతో ఉద్యోగంలో చేరితే, తమతో సేవల చేయించుకున్నారు తప్ప వీరి యొక్క శ్రమకు కనీసం ప్రభుత్వం గుర్తించలేదని, కోవిడ్ సమయంలో వీరి ప్రాణాలు పోయిన ప్రభుత్వం పట్టించుకోని ఉండేది కాదేమోనని వారన్నారు. ఆదివాసీ ప్రాంతంలో మారుమూల గ్రామాల్లో కనీస వైద్య సేవలను అందనీ పరిస్థితులు ఉన్నప్పటికీ, వీరితో సేవలు ఉపయోగించు కోవాల్సిది పోయి వీరి ని రోడ్డుమీదన వదిలేయటం చాలా దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వం అధికారులు నుండి కనీస స్పందన లేకపోవడంతో ఈ నెల 28 సోమవారం చలో ఏఎంసీ ( ఆంధ్ర మెడికల్ కాలేజ్) ముట్టడి చేస్తున్నామని కోవిడ్ వారియర్స్ హక్కుల పోరాట సమితి గౌరవ అధ్యక్షులు అమర్, అధ్యక్షులు దుర్గా కార్యదర్శి రోజా, ఏఐవైఎఫ్ నాయకులు చంటి ,మున్నా, జీవన్, రాజు కుమార్ ఒక ప్రకటనలో తెలయజేశారు.

# 28న ఎమ్మెల్యే, ఎంపీ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

## కార్యకర్తలుకు, నాయకులుకు సిరపురపు పిలుపు



పరవాడ : రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టత్మకంగా చేపట్టిన పేదలు అందరికీ ఇల్లు అనే కార్యక్రమంలో భాగంగా పరవాడ మండల ములో లబ్దిదారులు అందరికీ సోమవారము ఇ.బోనంగి, పరవాడ, వెన్నలపాలెం, కలపాక,పి.బోనంగి, గొర్లివానిపాలెం తదితర గ్రామాల్లో లబ్ధిదారులకు ఇండ్లపట్టాలు పంపిణీ మరియు ఇల్లు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహస్తారుఅని వైసిపి మండలపార్టీ ప్రెసిడెంట్ సిరపురపు అప్పలనాయుడు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అనకాపల్లి ఎంపీ బి.వి.సత్యవతమ్మ, పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అధీప్‌రాజ్ హాజరుఅవుతారు అన్నారు. ఈ కార్యక్రమానికి మండలములో గల నాయకులు, కార్యకర్తలు, అధికారులు హాజరై జయప్రదం చేయాలి అని ఈ సందర్భంగా సిరపురపు అప్పలనాయుడు కోరారు.

# భారీగా జగనన్న ఇండ్ల పట్టాల పంపిణీ



పెద్దాపురం : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన అందరికీ ఇండ్ల పట్టాలు పంపిణీలో భాగంగా పెద్దాపురం నియోజకవర్గం, పెద్దాపురం మండల పరిధిలో గల లబ్ధిదారులకు ఇండ్ల పట్టాల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో 62 ఎకరాలుకు గాను, 12 గ్రామాల లబ్ధిదారులకు 2 వేల 10 ఇండ్ల పట్టాలను పంపిణీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో పెద్దాపురం నియోజకవర్గం వైసీపీ ఇన్‌ఛార్జి, కో ఆర్డినేటరు అయిన దొవులూరి దొరబాబు, పెద్దాపురం ఎంఆర్ఓ శ్రీదేవి, నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పెద్దాపురం పరిధిలో గల రామేశ్వరం మెట్ట మీద ఈ ఇండ్ల పట్టాలు కార్యక్రమం జరిగింది.

# ఘనంగా వంగవీటి 33వ వర్థంతి వేడుకలు



లంకెలపాలెం : వంగవీటి మోహన్ రంగా 33వ వర్ధంతి వేడుకలు శనివారం అగనంపూడి పెడమడకలో ఘనంగా నిర్వహించారు. రంగా, రాధా మిత్ర మండలి అగనంపూడి ఏరియా అధ్యక్షులు మోటూరు వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో....

విందుల చిరురాజు, మురళీకృష్ణ పాల్గొని రంగా చిత్రపటానిక పూల మాలలు వేసి ఘనంగా నివళులర్పించారు. ఈ సందర్భంగా చిరూరాజు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, పేదల పాలిట పెన్నిధి, యుక్త వయసులో ఎంతో ప్రజాభిమానం పొందిన నాయకులు రంగా అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మడ్డి శ్రీను, విందుల నారాయణ రావు, అప్పలరాజు, గంగరాజు, చంటి తది తరులు పాల్గొన్నారు.

## ఆయుష్ మంత్రి శ్రీపాద్ వై నాయక్ 102 సంవత్సరాలుగా అత్భుతమైన సేవలనందిస్తోన్న ద యోగా ఇనిస్టిట్యూట్

విశాఖపట్నం : మహమ్మారి సమయంలో శారీరక ఆరోగ్యం మాత్రమే కాదు మానసిక ఆరోగ్యమూ మెరుగుపరుచుకునేందుకు, ప్రపంచానికి భారతదేశం అందించిన యోగా ఎంతగానో తోడ్పడిందని భారత ఆయుష్ శాఖామాత్యులు శ్రీపాద్ నాయక్ అన్నారు. కోవిడ్ కాలంలో చేపట్టిన కార్యక్రమాలతో పాటుగా 102 సంవత్సరాల పాటు ప్రజలకు సేవ చేయడంలో చూపిన అంకిత భావం పట్ల ద యోగా ఇనిస్టిట్యూట్ ను ఆయన ప్రశం సించారు. యోగా ఇనిస్టిట్యూట్ 102 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వర్చ్యువల్‌గా నిర్వహించిన వేడుకలలో ముఖ్యఅతిథిగా మంత్రి పాల్గొన్నారు. ఆ వేడుకలలో భాగంగా నిస్పాంద మెడిటేషన్ యాప్‌ను లాంఛనంగా ఆవిష్కరించారాయన. ఈ సందర్భంగా మంత్రి నాయక్ మాట్లాడుతూ యోగా ఇనిస్టిట్యూట్ అంకితభావం, నిజాయితీ, సమగ్రత వంటివి యోగా సంప్రదాయాలను కాపాడటంలో ఎంతగానో సహాయపడటంతో పాటుగా అంతర్జాతీయంగా లక్షలాది మంది ప్రజల జీవితాలలోనూ మార్పు తీసుకువచ్చా యన్నారు. ప్రపంచశాంతికి యోగా ఇనిస్టిట్యూట్ ఎంతగానో తోడ్పాటునందించిందంటూ, ఈ ప్రపంచానికి ఇండియా అందించిన బహుమతి యోగా అన్నారు.

# నాగ వంశ కులస్థులకు ఋణపడి ఉంటా

## నాగవంశం కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ బొడ్డు అప్పలకొండమ్మ



భీమునిపట్నం : (ఆమదాల వలస) శ్రీకాకుళం జిల్లా ఆమ దాలవలస నియో జకవర్గం లోని సరుబుజ్జిలి మండలం పురుషోత్తంపురం గ్రామం లో జరిగిన ఇళ్ల పట్టాల కార్యక్రమంలో శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం పాటు పాల్గొన్న నాగవంశం కార్పొరేషన్ చైర్ పర్సన్ బొడ్డు అప్పలకొండమ్మ, అప్పల నాయుడు, నాగ వంశం డైరెక్టర్ గంగిరెడ్ల ఉమాదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాగ వంశ కులస్థులకు మేము రుణ పడి ఉంటామని నాగ వంశస్తు లకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలు వర్తింపు జేయడంతో పాటు నాగవంశస్థులు గర్వపడే విధంగా పదవికి వన్నె తెచ్చి కులానికి మరింత ఖ్యాతిని తెస్తామన్నారు. ఈ కార్యక్రమం లో వై సి పి సయుక్త కార్యదర్శి బొడ్డు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# రాంగ్ పార్కింగ్ కు బ్రేక్...



మధురవాడ : ఇక పై రాంగ్ పార్కింగ్ చేసే వారి పై పీఎం పాలెం ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝులిపించ నున్నారు. జీవీఎంసీ మధుర వాడ పరిసర ప్రాంతాల్లో శనివారం ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు పీఎంపాలెం ట్రాఫిక్ సీఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పిఎస్ పరిధిలో సర్వీస్ రోడ్డు ప్రక్కనే ఉన్న డి మార్ట్ అలాగే చందు సెంట్రల్ వద్ద పార్కింగ్ పై అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ కొత్త సంవత్సరం నుంచి ట్రాఫిక్ రూల్స్ మారుతున్నాయని, రోజురోజుకి పెరుగుతున్న ట్రాఫిక్ కారణంగా సమస్యలు ఎక్కువా అవుతున్నాయని ముఖ్యంగా ప్రధాన షాపింగ్ మాల్స్ వద్ద ఇష్టానుసారంగా పార్కింగ్ చేయడం వలన ఇటు వాహన చోదకులు, అటు పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. ప్రజలందరూ తమ వాహనాలను నిర్దేశించిన ప్రదేశాలలో మాత్రమే పార్కింగ్ చేసి పోలీసు వారికి సహకరిం చాలని, అతిక్రమిస్తే జరిమానా తప్పదని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో...

పీఎం పాలెం నార్త్ క్రైమ్ సీఐ ఈశ్వర్ రావు, ట్రాఫిక్ ఎస్ ఐ సోమరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రేయాస్ ఈటీ లో విడుదలవుతున్న

# మణిభూషణ్ 'దివ్యక్షేత్రం' చిత్రం




విశాఖపట్నం : నగరానికి చెందిన ప్రముఖ పర్యాటక స్వచ్ఛంద సంస్థ డిజిటల్ వీడియోస్ మరియు విశాఖ ట్రావెల్ అండ్ టూరిజం ఫౌండేషన్ , టీవీ టూరిజం సంయుక్తంగా నిర్మించిన , రబ్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ వారి నిర్మాణాత్మ విలువలతో ప్రముఖ దర్శకుడు జాతీయ అవార్డు గ్రహీత మణి భూషణ్ గారి రచన మరియు దర్శకత్వం లో అంత్యంత రమణీయమైన దృశ్య కావ్యంగ రూపొంది , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 2019 ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో ఉత్తమ పర్యాటక చిత్రంగ ప్రతిభ పురస్కారం పొందిన "" దివ్యక్షేత్రం "" చిత్రానికి డిజిటల్ రంగం లో ప్రపంచ మొదటి డిజిటల్ థియేటర్ అయినటువంటి శ్రేయాస్ ఈటి అప్ లో ఈరోజు అతి పవిత్రమైన వైకుంఠఏకాదశి సందర్భంగా సాయంత్రం విడుదల చేస్తున్నారు. ఒక డాక్యుమెంటరీ చిత్రాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తున్న శ్రేయాస్ ఈటి మణి భూషణ్ గారి దర్శకత్వ ప్రతిభకు ఇచ్చిన గౌరవం , విశాఖ చిత్ర సీమకు రాజధాని అవుతుందని ""దివ్యక్షేత్రం "" తోనే తొలిఅడుగులు పడ్డాయని ఇది చాల సంతోషించదగిన సందర్భమని, ఈ చిత్రం కళల పుట్టినిల్లు అయినటువంటి విజయనగరం లో వెలసిన అతి పురాతనమైన 1000 ఏళ్ళ చరిత్ర కలిగిన సంపూర్ణ రాతి కట్టడమైన ఈ అద్భుతమైన ఆలయం శ్రీ శ్రీ శ్రీ మన్నార్ రాజా వేణుగోపాల స్వామి వారి దివ్యక్షేత్రం . ఎంతో అపురూపమైన శిల్ప సంపందతో , విశాలమైన మండపం తో , ఆకాశాన్ని అంటే గాలిగోపురం , విమాన గోపురం , అద్భుత కళాకృతులతో ఈ ఆలయం ప్రతి ఒక్కరిని అలరిస్తుంది . ఎంతో మహిమాన్వితమైన ఈ ఆలయ సౌందర్యాన్ని ప్రపంచానికి తెలియజేయాలని , వేయ్యి కొత్త గుడుల నిర్మాణం కన్నా ఒక పురాతన ఆలయం పరిరక్షణ ఉత్తమమని సందేశమిచ్చే ఈ చిత్రం అందరి మన్నలను పొంది ఈరోజు అరుదైన గౌరవం పొందిందని శ్రేయాస్ ఈటి లో విడుదల సందర్భంగా, ప్రేక్షకులు అందరు చిత్రాన్ని ఆదరించాలని దర్శకుడు మణి భూషణ్ కోరుకున్నారు. ఈ సందర్భంగా రబ్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ అధినేత ఆదిత్య భూషణ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో తొలిసారి ఒక డాక్యుమెంటరీ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేస్తున్న శ్రేయాస్ ఈటి ఒక గొప్ప చారిత్రాత్మక గౌరవం అందించింది అని కృతజతలు తెలిపారు.

ఈ వైకుంఠఏకాదశి రోజు మీకు అందరికి డిజిటల్ లో వేణుగోపాల స్వామి దర్శనం చేసుకొని స్వామి వారి అస్సిసులు పొందాలని కోరుకున్నారు .ఈ చిత్రానికి పనిచేసిన ,కెమెరా శివ చరణ్ , మ్యూజిక్ టామ్, ఎడిటింగ్ &గ్రాఫిక్స్ నీరాజభూషణ్, వాయిస్ ఓవర్ ఆదిత్య,అనూష అందరికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## జాతీయ వినియోగదారుల హక్కుల రోజు సందర్భంగా

# కోవిడ్ -19 వారియర్స్ సర్టిఫికెట్స్ అందజేత

విశాఖపట్నం : ప్రముఖ హొటల్లో శనివారం జరిగిన జాతీయ వినియోగదారుల హక్కుల రోజు సందర్భంగా జరిగిన కార్యక్రమంలో విశాఖపట్నం కన్జ్యూమర్ కమిషన్జి జిల్లా జడ్జి సూర్య భాస్కరం చేతుల మీదగా కోవిడ్ సమయము నందు ప్రజలకు చేసినా సేవకి గుర్తించి సభ్యులకు జాతీయ వినియోగదారుల జడ్జ్ సూర్య భాస్కర్ గా మరియు జాతీయ చైర్మన్ అడ్మిన్ సాయి రమేష్ చేతుల మీదగా సభ్యులకి అందరికీ కోవిడ్ -19 వారియర్స్ సర్టిఫికెట్స్ అందజేయడం జరిగింది జడ్జి సూర్య భాస్కర్ మాట్లాడుతూ వినియోగదారులు అందరూ వినియోగదారుల హక్కులు తెలుసుకొని వాళ్ళు లాభం పొందాలని కొనియాడారు. సాయి రమేష్ మాట్లాడుతూ వినియోగదారుల సంఘం తరపున మా వంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు ,జాతీయ ఉపాధ్యక్షులు, ఎం. కమల్ కుమార్ మాట్లాడుతూ వినియోగదారుల హక్కులుకు న్యాయం చేసేందుకు నాకు ఇచ్చిన బాధ్యత అదృష్టంగా భావిస్తున్నాను అని చెప్పేరు.

అలాగే నేషనల్ కన్జ్యూమర్ కమిషన్ తరపున జాతీయ, రాష్ట్ర మరియు జిల్లాల సభ్యులు జడ్జి సూర్య భాస్కరంకి ఘనంగా సన్మానం చేసి కృతజ్ఞతలు తెలిపారు,జాతీయ స్థాయి లీడర్స్, పి. వాసు,టీ.ఎస్ క్రాంతి కుమార్, బి.సాయి శ్రీనివాస్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# నాతవరంలో సీపీఐ వార్షికోత్సవ వేడుకలు



నర్సీపట్నం : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 95వ వార్షికోత్సవ వేడుకలు నాతవరం మండల సిపిఐ మండల కార్యదర్శి డి.అజయ్‌బబు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా అజయ్‌బాబు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భవించిన దగ్గర నుండి పేదల పక్షాన ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ఇచ్చినటు వంటి మూడు రైతు చట్టాలు రైతులకు నష్టం కలిగించే విధంగా ఉన్నాయన్నారు. భవిష్యత్తులో రైతులకు రక్షణ లేకుండా పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు మహిళా సంఘం నాయకురాలు కూనిశెట్టి భవాని, సిపిఐ యువ నాయకుడు మనీబాబు, మండల సిపిఐ కమిటీ సభ్యుడు ఈ.మాణిక్యం, సిపిఐ నాయకుడు కాంద్రకోట సోమరాజు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# చౌడువాడ గ్రామంలో ఇళ్లు పట్టాలు పంపిణీ



నర్సీపట్నం :చౌడువాడ గ్రామంలో ప్రియతమ నాయకులు మన ఆంధ్రప్రదేశ్ ముద్దుబిడ్డ సీ.ఎం వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఇస్తున్న ఇళ్ల పట్టాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. పాయకరావుపేట నియోజకవర్గం కోటవురట్ల మండలం చౌడువాడ గ్రామంలో చౌడువాడ, గొట్టివాడ, పందూరు, రామచంద్ర పురం, రాజుపేట గ్రామాల లబ్ధిదారులకు ఎమ్మెల్యే, శ్రీ గొల్ల బాబూరావు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులు మాజీ శాసన మండలి సభ్యులు డి వి సూర్యనారాయణ రాజు చేతుల మీదుగా ఇళ్లు పట్టాలు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి దత్తుడు సీతబాబు మండల పార్టీ అధ్యక్షులు పైలా రమేష్ వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

# ఘనంగా ప్రభ చిల్డ్రన్స్ హెూమ్ బ్రాండ్ అంబాసిడర్

# పెద్దిశెట్టి ఉషశ్రీ జన్మదినోత్సవ వేడుకలు




విశాఖపట్నం : జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, 43 వ వార్డు వైసిపి కార్పొరేటర్ అభ్యర్థి, ప్రభ చిల్డ్రన్స్ హెూమ్ బ్రాండ్ అంబాసిడర్ పెద్ధిశెట్టి ఉషశ్రీ జన్మదినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అక్కయ్యపాలెం దాడి రామ్మూర్తి కళ్యాణమండపంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రభ చిల్డ్రన్స్ హెూమ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. త్వరలో జరగనున్న జీవీఎంసీ ఎన్నికల్లో ఉషశ్రీ కార్పొరేటర్ గా విజయం సాధించి ప్రజలకు అండగా నిలబడాలని కోరారు. భవిష్యత్తులో రాజకీయంగా ఎదిగి మరిన్ని పదవులు అధిరోహించాలని ఆశీర్వదించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. బీసీ కార్పొరేషన్లలో చైర్మన్లు, డైరెక్టర్ లు గ మహిళలకు 50 శాతం కేటాయించిన ఘనత జగన్ కే దక్కుతుందన్నారు. ఉత్తరంలో కార్పొరేటర్ అభ్యర్థులు అందరిని గెలిపించి ముఖ్యమంత్రికి గిఫ్ట్ గా ఇవ్వాలని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజును కోరారు. కేకే రాజు మాట్లాడుతూ స్పోర్ట్స్ ఉమెన్ గా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న ఉషశ్రీ రాజకీయాల్లోకి రావడం శుభపరిణామమన్నారు. ఇటువంటి విద్యావంతులు రాజకీయాల్లోకి వస్తే ప్రజలకు మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉషశ్రీ మాట్లాడుతూ తన పుట్టిన రోజును ప్రభ చిల్డ్రన్స్ హెూమ్ ఘనంగా నిర్వహించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రముఖుల మధ్య జన్మదినోత్సవ వేడుకలు చేసుకోవడంతోపాటు, రక్తదాన శిబిరం నిర్వహించడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు ప్రదానం చేశారు. ఉత్తమ సింగర్ బి వి ఎస్ ఎల్ హర్షిత, బెస్ట్ సపోర్టింగ్ వి. నీలిమ తదితరులు మంత్రి చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు. మహా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు తాటి ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో 45 వార్డు వైసిపి కార్పొరేటర్ అభ్యర్థి బాణాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్ల పట్టాలు పంపిణీ



నర్సీపట్నం : నాతవరం మండలం పెదగొలుగొండపేట గ్రామంలో శనివారం నాతవరం తహశీల్దార్ జానకమ్మ ఆధ్వర్యంలో సుమారు 113 మంది నిరుపేదలైన ఇళ్ల లబ్ధిదారులకు ఇంటి స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఇల్లు లేని అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ చిన్నబ్బాయి, సర్వేయర్ సత్యనారాయణ, వీఆర్వో అప్పారావు, వైసిపి నాయకులు శెట్టి నూకరాజు, జయరాజు, సునీస, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీకి గానీ నా వ్యక్తిగత ప్రతిష్టకు గాని భంగం కలిగిస్తే

## తగిన మూల్యం చెల్లించక తప్పదు : ఎమ్మెల్యే అధీప్‌రాజు

పెందుర్తి : అదీప్ రాజు అనే వ్యక్తి తప్పు చేయడు అక్రమంగా డబ్బు సంపాదించడమే నా ధ్యేయం అయితే గత 15 సంవత్సరాల క్రిందటే నాకు అవకాశం వచ్చిందని కానీ అలాంటి తప్పు చేసే వ్యక్తిని కాదని నేను సర్పంచ్ గా పని చేసే సమయంలోనే నా సొంత నిధులు కోటి రూపాయలతో పేద ప్రజలకు స్వయంగా ఇల్లు కట్టించానని అన్నారు శుక్రవారం ప్రముఖ ఛానల్లో వచ్చిన కథనానికి స్పందిస్తూ ఎమ్మెల్యే పై విధంగా అన్నారు శనివారం రాంపురం లో తన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మల్ల తులసీరామ్ అనే వ్యక్తి షాడో ఎమ్మెల్యే గా వ్యవహరిస్తూ పలు వసూళ్లకు పాల్పడుతున్నారు అని మీడియాలో వచ్చిన కథనానికి స్పందిస్తూ తులసిరామ్ చేసిన అక్రమ వసూళ్ల నిజమైతే తగిన చర్యలు తీసుకుంటామని ఈరోజు నుంచి తులసీరామ్ అనే వ్యక్తిని పార్టీ నుంచి బహిష్కరిస్తున్నామని తెలియజేశారు నియోజక వర్గంలో అధికారులు గాని పార్టీ కార్యకర్తలు గాని ఎవరైనా అక్రమ వసూళ్లకు గాని పాల్పడితే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు

మీడియాలో వచ్చిన కథనాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు ఇకపై మల్ల తులసిరామ్ అనే వ్యక్తితో పార్టీకి గానీ నాకు గాని ఎటువంటి సంబంధం లేదని తెలిపారు ఈ కార్యక్రమంలో జయరామ్,ఎల్బీ.నాయుడు నక్క కనకరాజు, దాసరి రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ బాల భారతి భజనమండలి రజతోత్సవ వేడుకలు



గాజువాక : కణితి గ్రామం, కళింగ వీధి, కోదండ రామాలయం లో శ్రీ బాల భారతి భజనమండలి పుట్టి, పెరిగి, దిన దినప్రవర్ధమానమై, దిగ్విజయంగా 25 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా రజితోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. "శ్రీ బాల భారతి భజన మండలి" కణితి కోదండ రామాలయ, అభయాంజణనేయ సంయుక్త ఆలయ కమిటి సభ్యుల తో పాటు, కణితి గ్రామ పెద్దలు, పుర ప్రజల సహాయ సహకారములతో, వైకుంఠ ఏకాదశి, పుణ్య తిథి, మరియు గీతాజయంతి పర్వదిన మైన శుక్రవారం "అర్ధ ఏకాహం" అను పేర ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు స్థానిక భజన మండళ్ళ కళాకారులతో భగవన్నామ సంకీర్తన, భజనలు జరిపించి, భజన కళాకారుల్ని, సత్కరించడం జరిగింది. ఈ ముగింపు వేడుకలకు గౌరవ అతిథులుగా, విశాఖ ఉక్కు కర్మాగార ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (వర్క్స్) ఇన్ ఛార్జ్ కె.వి. విద్యా సాగర్, ట్రాఫిక్ సి,ఐ. ప్రసాద్ రావు విచ్చేసి , భజనల నిర్వహణ విషయమై శ్రీ బాల భారతి భజనమండలి సారథి అయిన బోనెల రాజారావు చే సంకలనం చేయబడిన "భజనయజ్ఞం" అను పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రఖ్యాత కళాకారులచే "సినీ సంగీత విభావరి" కార్యక్రమంలో భక్తి గీతాలు, భావ గీతాలు ఆలపించి ప్రేక్షకులకు వీనుల విందు చేశారు. పాల్గొన్న భజన కళాకారులను, శాలువలతో సత్కరించి, జ్ఞాపికలను ముఖ్య అతిథుల అమృత హస్తాల తో అందజేసారు. ముఖ్య అతిథులైన కె. వి. విద్యా సాగర్, ప్రసాద రావు ను గ్రామ పెద్దలు, కోదండ రామాలయ, అభయాంజనేయ ఆలయ సంయుక్త కమిటి సభ్యులు ఘనంగా సత్కరించారు. గడచిన 25 ఏళ్ళ లో శ్రీ బాలభారతి భజన మండలి వేలాది భజనలు చేయడమే కాకుండా, జిల్లా, రాష్ట్ర స్థాయి భజన పోటీలలో పాల్గొని ప్రధమ బహుమతులను సాధించి ప్రశంశలు పొందిందని నిర్వాహకులు తెలిపారు. "భజనయజ్ఞం" పుస్తక సంకలనకర్త బోనెల రాజారావు గత 6 సంవత్సరాలుగా శ్రీ బాల భారతి భజన మండలి అనుబంధ సంస్థయిన "శ్రీ త్రిశక్తి భజన మండలి" సభ్యుల సవాకారం తో నిర్వహించిన "భజన యజ్ఞం" కార్యక్రమ అనుభవాలను, సేకరించిన విషయాలను, చలనచిత్ర మధుర గీతాల బాణీలలో స్వయంగా కూర్చిన పాటలను క్రోడీకరించి "భజనయజ్ఞం" పుస్తకాన్ని రూపొందించారు. అదే విధంగా భజన యజ్ఞాలన్నిటికి జ్ఞాపికలను స్టీల్ ప్లాంట్ ఉద్యోగి అయిన శ్రీ మేడిశెట్టి అచ్చిలు నాయుడు గారు తమ ధర్మపత్ని స్మృత్యర్థం "రత్న సాయి ఛారిటబుల్ ట్రస్ట్" ద్వా రా కళాకారులందరికి జ్ఞాపికలను అంద జేశారు. అంతేకాకుండా, ప్రతి నెలా పేదలకు అన్నదాన కార్యక్రమాలు జరిపిస్తూ, సామాజిక సేవ చేస్తున్నదని తెలిపారు. ఈ విధంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేస్తూ, ప్రోత్సాహిస్తూ, భజనలు అంతరించి పోకుండా బ్రతికిస్తూ తన విజయ యాత్ర కొన సాగిస్తూ, కారకులైన వారందరికి కృతజ్ఞతలు తెలుపుకుంటుందని శ్రీ బాల భారతి భజన మండలి, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కణితి గ్రామ పెద్దలు పుర ప్రజలు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## భూచట్టాల సమగ్ర సర్వే చేయడం ద్వారా రైతులకు మేలు

## నర్సీపట్నం సబ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య


మాట్లాడుతున్న నర్సీపట్నం సబ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

నర్సీపట్నం : భూచట్టాలపై సమగ్ర సర్వే చేయడం ద్వారా రైతులకు ఎంతగానో మేలు జరుగుతుందని నర్సీపట్నం సబ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అన్నారు. శనివారం గొలుగొండ విచ్చేసిన ఆమె మండల రెవెన్యూ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. రీ సర్వే దాౖర గతంలో నుండి ఉన్నటువంటి భూసమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవడం వలన రైతులకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. డివిజన్‌లో 10 సెంటర్లుగా విభజించి సర్వే ద్వారా రైతుల సమస్యలు మూడు రోజుల్లో మండల అధికార్లు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గొలుగొండ మండలానికి సంబంధించి 1578 హౌసింగ్ పట్టాలు ఇప్పటి వరకు గుర్తించడం జరిగిందన్నారు.

# జివిఎంసి మెడలో మరో మణిహారం



విశాఖపట్నం : కేందప్రభుత్వపు గృహనిర్మాణ మరియు పట్టణాభివృద్ధి వ్యవహారాల శాఖ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పి.ఎం.ఏ.వై. - 2019 పధకాన్ని ఎంతో గోప్పగా రాష్ట్రంలో చేపట్టినందుకు గాను గృహ నిర్మాణ పధకంలో ఆచరిస్తున్న అధునాత్మక పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని నిర్మాణాలు చేపడుతున్నందుకు గాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి మూడు కేటగిరీలలో అవార్డులు, ప్రాజెక్టు మోనిటరింగ్ టూల్స్, ఇన్నోవేటివ్ కన్ స్ట్రక్షన్ టెక్నాలజీ మరియు ప్రత్యేక బహుమానం క్రింద విశాఖపట్నాన్ని అత్యుత్తమ మున్సిపల్ కార్పోరేషన్ నిర్వాహణా కేటగిరీల క్రింద అవార్డులు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

కేంద్ర ప్రభుత్వంలోని హౌసింగ్ మరియు పట్టణ వ్యవరాహాల శాఖ -2019 "కన్ స్ట్రక్షన్ టెక్నాలజీ ఇండియా" సమావేశంలో గౌరవ ప్రధాన మంత్రివర్యులు తీసుకున్న నిర్ణయం మేరకు దేశంలో గృహ నిర్మాణ రంగంలో అత్యుత్తమ ప్రతిభ, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, లబ్దిదారుల ఎంపికలో పారదర్శకత పాటించడం మొదలగు ఉత్తమ ప్రమాణాలను పాటించే రాష్ట్రాలు లేదా కేంద్ర పాలిత ప్రాంతాలలోని పట్టణ స్థానిక సంస్థలు, ఉత్తమ లబ్ధిదార్లకు అవార్డుల ప్రధానం చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయానికి అనుగుణంగా ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వం మూడవ బెస్ట్ పెర్ఫార్మన్స్ క్రింద ర్యాంకు సాధించినట్లు కేంద్ర ప్రభుత్వ అధికారులు ప్రకటిస్తూ ఈ అవార్డును గౌరవ ప్రధానమంత్రి చేతులు మీదుగా రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులుకు అందించే ఏర్పాటు చేస్తున్నట్లు లేఖలో తెలిపారు. ఇంకా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రకటించిన మూడు కేటగిరీలలో అవార్డుతో పాటు ఉత్తమ గృహ నిర్మాణ పధకం చేపట్టినందుకు నగరానికి చెందిన "సాత్రబోయిన దుర్గకు" ఉత్తమ లబ్దిదారునిగా సత్కరించబోతున్నట్లు కేంద్ర ప్రభుత్వం అధికారులు తెలిపారు. ఈ అవార్డుల ప్రధాన కార్యక్రమం తేది 01-01-2021నాడు వీడియో కాన్ఫెరెన్స్ ద్వారా నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వం సూచించే అధికారులకు / ప్రతినిధులకుగాని అందిస్తారని కేంద్ర ప్రభుత్వ అధికారులు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక విభాగమైన హౌసింగ్ మరియు పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వారు ప్రకటించిన అవార్డులో రాష్ట్ర ప్రభుత్వం తో పాటు విశాఖపట్నాన్ని గుర్తించి నందుకుగాను జివిఎంసి కమిషనర్ డా. జి. సృజన సంతోషాన్ని వ్యక్తపరుస్తూ, ఈ అవార్డు రావడానికి ముఖ్యంగా నగర పౌరులు క్రమశిక్షణతో చేయూత అందించడమే కారణమని, ఈ అవార్డు నగర పౌరులకు ముఖ్యంగా నిబద్దత కలిగిన లబ్దిదారులకు

చెందుతుందని పేర్కొన్నారు. కార్పోరేషన్ పరిధిలో సాంకేతిక పరిజ్ఞానంతో పేదలకు గృహ నిర్మాణాలను చేపట్టేందుకు గాను తగు తోడ్పాటు అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యంగా గౌరవ ముఖ్యమంత్రి వర్యులు, మున్సిపల్ శాఖా మంత్రివర్యులు, రాష్ట్ర మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు, టిడ్కో అధికారులు సంబందిత జివిఎంసి అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో పనిచేస్తూ, నగరంలో నివసిస్తున్న అర్హులైన పేదలందరికీ ఇండ్ల స్థలాలు మంజూరు చేయడానికి గాను తమవంతు కృషి చేస్తామని కమిషనర్ ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు.




# నాడు-నేడు తరహాలో స్మార్ట్ క్యాంపస్లుగా అభివృద్ధి



విశాఖపట్నం : గ్రేటర్ విశాఖపట్నం స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ వారు, CITIIS కార్యక్రమంలో భాగంగా, ఎంపిక కాబడిన 44 మునిసిపల్ పాఠశాలలను 65 కోట్ల వ్యయంతో నాడు-నేడు తరహాలో స్మార్ట్ క్యాంపస్లుగా అభివృద్ధి చేస్తున్నారన్న సంగతి ఇదివరకే ప్రజలకు తెలియజేయటం జరిగినది. ఇప్పటివరకు జోన్ 1, 3, 4, 5 మరియు 7కు సంబంధించిన 43 పాఠశాలలలో, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, పాఠశాల అభివృద్ధి కమిటీ, తల్లిదండ్రులు, యాజమాన్యం మొదలగు వారితో సమావేశాలు ఏర్పాటుచేసి, వినూత్నముగా సిద్ధము చేయబడిన ప్రణాళికలను వారి ముందుంచి, అభిప్రాయ సేకరణ చేయడం జరిగినది. వారి అభిప్రాయాలకు అనుగుణంగా ప్రణాళికలను అభివృద్ధి చేస్తున్నారు. అదేవిధంగా జోన్ 5లోని MH కాలనీ ప్రాధమిక పాఠశాలలో అభిప్రాయ సేకరణ సమావేశం ఏర్పాటు చేయటానికి ప్రణాళికలను సిద్ధము చేస్తున్నారు.

మరియు మోడల్ పాఠశాలగా ఎంపిక కాబడిన H.B కాలనీ ప్రాధమిక పాఠశాల యొక్క ప్రణాళికలను తయారు చేసి టెండర్ కి ప్రకటన ఇవ్వడం కూడా జరిగిందని తెలియ జేయడమైనది.

# సతీ సమేతంగా అప్పన్న ను దర్శించుకున్న మంత్రి అవంతీ





సింహాచలం: సింహగిరి పై వేంచేసియున్న శ్రీ వరాహలక్ష్మీనరసింహస్వామి వారిని శనివారము నాడు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు సతీ సమేతంగా దర్శించుకున్నారు

ఆలయానికి చేరుకున్న మంత్రి కి ఆలయ అధికారులు

సాంప్రదాయ బద్దం గా స్వాగతం పలుకగా మంత్రి స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు అనంతరం కప్పస్తంబ ఆలింగనం లక్ష్మీ అమ్మవారి దర్శనం చేసుకున్నారు మంత్రి దంపతులకు వైధికులు వేద ఆశీర్వచనం పలుకగా అధికారులు వీరికి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు ఈ కార్యక్రమంలో 98 వ వార్డు వైసీపీ కార్పొరేటర్ అభ్యర్థి ఎర్ర వరంబాబు వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వర్ రావు లంక సత్తిబాబు తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులకు కొత్తచట్టాలు అనుకూలం : జీవీఎల్

గుంటూరు: దేశంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యధికంగా మిర్చిని పండిస్తున్నారని ఎంపీ జీవీఎల్ నరసింహారావు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో మిరప సాగుపై చర్చించామని పేర్కొన్నారు. ఏడాదికి 6200 కోట్ల రూపాయల మిర్చి ఎగుమతి జరుగుతోందన్నారు.ఏఏ దేశాలకు ఎగుమతి చేయాలి, సాగులో ఎదురవుతున్న ఇబ్బందులు, మిర్చి రైతులకు మంచి ధర వచ్చేలా ఏ చర్యలు తీసుకోవాలి వంటి పలు అంశాలపై చర్చించామని జీవీఎల్ వెల్లడించారు.

కేంద్రం చేసిన కొత్త చట్టాలు రైతులకు అనుకూలంగా ఉన్నాయి. ఎగుమతి దారులతో రైతులను అనుసంధానం చేస్తాం. దీంతో మంచి ధర వచ్చే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. విపరీతంగా పురుగు మందులు వాడటాన్ని గమనించామని, అందరితో చర్చించి పురుగు మందుల వాడకాన్ని తగ్గించే విధంగా సిఫార్స్ చేస్తామని చెప్పారు.

వాటిని రైతుల వద్దకు తీసుకెళ్లేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని పేర్కొన్నారు. స్పైసెస్ పార్కును అందుబాటులో తెచ్చేందుకు అధ్యయనం చేసి చర్యలు తీసుకొంటామని ఎంపీ జీవీఎల్ నరసింహారావు వెల్లడించారు.

## వైస్సార్‌కప్ ఐదవ రోజు మ్యాచ్ ను ప్రారంభించిన కెకె.రాజు



మద్దిలపాలెం : వైస్సార్ కప్ క్రికెట్ మ్యాచ్ ఉత్తర నియోజకవర్గం నకు సంబంధించిన టీమ్ లు ఆంధ్రా యూనివర్సిటి ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్లో జరుగుతుంది. ఈ నేపథ్యంలో ఐదవ రోజు మ్యాచ్ లో ముఖ్యఅతిథిగా విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె కె రాజు పాల్గొని టాస్ వేసి క్రీడాకారులకు అభినందనలు తెలిపి మ్యాచ్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ పరిధిలో గల వార్డు అభ్యర్థులు రెయ్యి వెంకటరమణ, ఆళ్ల లీలావతి, మరియు షేక్ జుబైర్, నీలీరవి, నాగమణి, గాలి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు

## ఆర్జీఐఏలో భారీగా బంగారం పట్టివేత



శంషాబాద్: హైదరాబాద్‌లోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా బంగారం పట్టుబడింది. దుబాయ్ నుంచి హైదరాబాద్ వచ్చిన ఓ మహిళా ప్రయాణికురాలి నుంచి 2.21 కిలోల ఐదు బంగారు బిస్కెట్లు, 22 క్యారెట్ల బంగారు అభరణాలను అధికారులు స్వాధీనం చేసుకొని మహిళను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన బంగారం విలువ దాదాపు రూ.96 లక్షలుగా ఉంటుందని అధికారులు తెలిపారు.

## రాష్ట్ర బిజేపి మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శిగా ప్రేమకుమారి నియామకం



గాజువాక: పారిశ్రామిక ప్రాంతం గాజువాక నాతయ్యపాలెంకు చెందిన బీజేపీ మహిళా నాయకురాలు ప్రేమకుమారి రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శిగా నియమితులైయ్యారు.

ఆమె నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ, బీజేపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వి.ఎన్ మాధవ్, గాజువాక నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి.నరసింగరావు, రాష్ట్ర అదికార ప్రతినిధి డా.సుహాసినిఆనంద్,మహిళా మోర్చా నాయకురాల్లు జిలకర్ర. భువనేశ్వరి,రోహిణి తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఆదిలోనే టీమ్‌ఇండియాకు షాక్



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాతో జరుగుతున్న రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో టీమ్‌ఇండియా ఆదిలోనే వికెట్ కోల్పోయింది. మిచెల్ స్టార్క్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్ చివరి బంతికి మయాంక్ అగర్వాల్(0) ఔటయ్యాడు. అతడు ఎల్బీడబ్ల్యూగా వెనుతిరగడంతో భారత్ పరుగుల ఖాతా తెరవకముందే తొలి వికెట్ కోల్పోయింది. ప్రస్తుతం క్రీజులో శుభ్‌మన్ గిల్, ఛెతేశ్వర్ పుజారా ఉన్నారు. వీరిద్దరూ 8 ఓవర్లకు 28 పరుగులు చేశారు. అంతకుముందు బుమ్రా 4/56, అశ్విన్ 3/35, సిరాజ్ 2/40 చెలరేగడంతో ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 195 పరుగులకు ఆలౌటైంది. మార్నస్ లబుషేన్(48) టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

# ఏయూతో బిఎస్ఎన్ఎల్ ఎంఓయూ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ దిశగా కార్యక్రమం

## ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి



ఆంధ్రవిశ్వవిద్యాలయం : ఆంధ్రవిశ్వవిద్యాలయంతో బిఎస్ఎన్ఎల్ అవగాహన ఒప్పందం చేసుకుంది. ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజనీరింగ్, ఎంబిఏ విద్యార్థులకు ఉపాధికి అవసరమైన నైపుణ్యాలను, సాంకేతిక అంశాలపై శిక్షణ అందించే దిశగా ఈ శిక్షణ కార్యక్రమాలు జరగనున్నాయి. శనివారం ఏయూ పాలకమండలి సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో రెండు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాద రెడ్డి మాట్లాడుతూ నూతన విద్యా విధానంలో కేంద్ర ప్రభుత్వం ఇంటర్న్‌షిప్, నైపుణ్య శిక్షణను భాగం చేసిందన్నారు. దీనిని ఏడాదిన్నర క్రితమే రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన రెడ్డి ప్రతిపాదించారన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి దీనిని ఆచరణలో చూపడం జరుగుతోందన్నారు. విశ్వవిద్యాలయ పరిశోధకులకు ఇటువంటి శిక్షణ తరగతులు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. వర్సిటీతో సంయుక్తంగా పరిశోధనలు జరపాలని ఆహ్వానించారు. బిఎస్ఎన్ఎల్ పిజిఎం పి.విలియమ్స్ మాట్లాడుతూ దేశానికి మానవ వనరులే సంపదగా నిలుస్తున్నాయన్నారు. వీరికి మెరుగైన నైపుణ్యాలు, సామర్థ్యాలను అందించే దిశగా కలసి పనిచేయాల్సిన అవసరం ఉదంన్నారు. విద్యార్థులకు అవసరమైన ప్రత్యక్ష జ్ఞానాన్ని అందించడంలో బిఎస్ఎన్ఎల్ పూర్తిస్థాయిలో సహకారం అందిస్తుందన్నారు. బిఎస్ఎన్ఎల్ ఏజిఎం ఎం.సత్యప్రసాద్ శిక్షణలో భాగంగా అందించే శిక్షణ కార్యక్రమాలు, కోర్సు వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.క్రిష్ణమోహన్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పేరి శ్రీనివాస రావు, మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.కె భట్టి, అకడమిక్ డీన్ ఆచార్య కె.వెంకట రావు, డీన్ ఆచార్య ఏ.భుజంగ రావు తదితరులు పాల్గొన్నారు.



Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com